గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# ఏప్రిల్ 2016
# కథలు




"ఏంటమ్మా పొద్దున్నే హడావిడి?" పూజ చేస్తున్న తల్లిని అడిగాడు కొడుకు. మాటాడకుండా తన పని ముగించుకుని వచ్చి పక్కన కూర్చున్న ఆమె "ఈ రోజు తారీకు యెంతో గుర్తులేదా" అంది. గబుక్కున పేపర్ చూసి ఏప్రిల్ 12 అన్నాడు. 'మరీ మర్చిపోయావా? ఏడు ఈ రోజు నాన్నగారు చేసేవారు కదా, అందుకే ఈ సారి నేను చేస్తున్నా"

అవున్నిజమే కానీ ఎందుకు చేసేవారో ఎన్ని సార్లు అడిగినా చెప్పేవారు కారు. మరి ఇప్పుడు నువ్వెందుకు చేస్తున్నట్లు?"

"రాత్రి కలొకొచ్చి మర్చిపోతావేమోనే నేనెలా చేసేవాడినో అలాగే నువ్వు కూడా చెయ్యి అని గుర్తు చేసార్రా, అందుకే .."నవ్వి లోనికి వెళ్ళిపోయాడు కొడుకు.

ఇంట్లో వాళ్ళందరూ ఆఫీసులకీ , స్కూల్లకీ వెళ్ళిపోయాక ఆడాళ్ళు టిఫిన్ చేస్తుండగా మళ్ళీ కోడలు అడిగింది. "అప్పుడు మామయ్యా గారు చాలా నిష్టగా చేసేవారట కదా అత్తయ్య. రోజంతా మౌన వ్రతం, ఉపవాసం కూడా వుండేవారట, మీ అబ్బాయి చెప్పారు"

"ఊ.."...ఇప్పుడు తనను కూడా ఉపవాసం చెయ్యమంటదా అని సాలోచనగా చెప్పింది పెద్దావిడ. "ఇంతకీ ఎందుకు ఈ రోజు పూజ?" తింటూనే అడిగింది కోడలు. తల ఎత్తి ఆమె కళ్ళల్లోకి సూటిగా చూస్తూ చెప్పడం మొదలుపెట్టింది అత్తగారు.

**********************

నేను కాలేజి చదివే రోజుల్లో తను నాకు పరిచయం అయ్యింది. పేరు ప్రియ. నేను మాత్రం "సుప్రియా" అని పిలిచుకునేవాడిని, వయసు వేడి చల్లారాక ఇద్దర్లోనూ ప్రేమ సెగ తగ్గింది. క్రమంగా దూరంకాసాగాము.

కాలేజి విడిచాక మేము పూర్తిగా విడిపోయాము. అప్పుడప్పుడూ క్లాస్మేట్ల పెళ్ళిళ్ళలో కలుసుకోవడం తప్ప మా మధ్య సంబంధం కొరవడింది. అటువంటిది పెళ్ళిలయ్యి పిల్లలు పుట్టాక మదిలో ఎక్కడో పూడుకుపోయిన తొలి వలపు విత్తు మళ్ళీ చిగురులు తొడిగింది. అందుకు కాలం కూడా అనుకూలించింది. మా స్నేహితుడు ఒకడు ఆఫీసు పని మీద వచ్చి నన్ను కలసి ఆమె తన ఊరిలోనే , వాళ్ళింటికి దగ్గరిలోనే భర్తతో కాపురం వుంటుందని , ఆమెకు పిల్లాడని చెప్పాడు. మరోసారి వచ్చినప్పుడు ఆమె నన్ను అడిగినట్టు చెప్పి తన ల్యాండు లైను ఫోను నంబర్ ఇచ్చాడు.

వెంటనే నేను స్న్ ్ద్ బాణం సంధించాను, అది తన లక్ష్యం చేరింది. మాట్లాడుకున్నది 5 నిముషాలైనా మా మనసులు మరింత పెనవేసుకున్నాయి. సొంత వ్యాపారం చేసుకునే భర్త ఇంటివద్దనే వుంటాడని మరెప్పుడూ తను చేస్తే తప్ప కాల్ చెయ్యరాదని షరతు విధించింది. అప్పటినుంచి యూనివర్సల్ లవర్స్ ్ కొడుకు అనుకూలించని మా ఆఫీసు ఫోను మోగితే చాలు గుండె ఝల్లు మనేది. నాకోసం ఏఫోను వచ్చినా తనే చేస్తుందేమో అని అనిపించేది. కానీ ఆమె నుంచి ఏనాడు కాల్ రాలేదు. ఆగలేక నేనే ఏ పనిమీద ఎక్కడకెళ్ళినా అక్కడి నుండి వేరు వేరు నంబర్ల నుండి చేసేవాడిని. కాని ఎన్నడూ గురితగలలేదు.

ఆమెకు వీలు కుదిరినప్పుడు బహుశా ఆఫీసు టైము మించిపోతుందేమోనని అనుమానంతో ఇంట్లో ఫోను పెట్టిద్దామనుకున్నాను. అప్పుడే దేశం లోకి సెల్ఫోన్ల రాక మొదలయ్యింది. విదేశాల నుంచి వస్తూ చుట్టం ఒకాయన మొబైల్ ఫోనొకటి పట్టుకొచ్చి ఇచ్చాడు.

నేనూ అటువంటి సర్వకాల సర్వావస్థలలో అందుబాటులో వుండే దానికోసమే చూస్తున్నాను కనుక మొదటికాల్ ఆ స్నేహితుడికి చేసి నా నంబరు తనకు అందజెయ్యమన్నాను. అయినా పరిస్థితిలో మార్పు లేదు. నా స్న్ ్ద్ బాణం ఒకటి తగిలింది కానీ ఎక్కువ మాటాడే వీలు కుదరలేదు. అటువంటి పరిస్థితులలో ఒక రోజు నా మొబైలుకు ఒక మిస్స్ ్ కాల్ వచ్చింది. అప్పట్లో అటూ ఇటూ ఇరువైపు చార్జీలు పడేవి కనుక జనాలు ఇలా రింగ్ ఇస్తే ల్యాండు లైను నుంచి చేసేవాళ్ళం. కానీ అది నాకు తెలియని నంబరు కావడంతో ఆ పని చెయ్యలేదు. కొంత సేపటికి ఆఫీసు ఫోనుకు కాల్ వచ్చింది. అదే ఆమె అక్కడికి నాకోసం చేసిన మొదటి, చివరి కాల్. ఆమె భర్త తనకు కూడా మొబైల్ కొనిచ్చాడట.

ఆఫీసు టైములోనే అని నేను, వరుసగా రెండు సార్లు మిస్స్ ్ కాల్ ఇస్తేనే చెయ్యాలి అని తను ఇలా ఆంక్షలు ఇరు వైపులా అమలులో వుండేవి. అప్పుడప్పుడే లంకె సందేశాల ఒరవడి మొదలయ్యింది. ఉదయాన్నే శుభోదయం, రాత్రి శుభరాత్రి, వివిధ సందర్భాలకు తగు సందేశాలు నా కాల్ లిస్టు లో వున్న అందరితో సాగుతుండేవి. కానీ భర్తకు జడిసి తను మాత్రం ఏమి సందేశాలు పంపేది కాదు.

ఆ రోజు ఏప్రిల్ 11 ఏదో పండుగ సెలవు. ఉదయాన్నే శుభాకాంక్షల సందేశాల వెల్లువ మొదలయ్యింది. అన్నిటిని చూస్తూ వారు పంపిన దాన్ని వారికి పంపిస్తూ కూర్చున్నాను. ఇంతలో సుప్రియ నుంచి కూడా ఒక మెసేజ్ వచ్చింది. నేను చూసి ఊరుకున్నా.

మరికొంత సేపటికి తన నుంచి ఇంకోటి వచ్చింది. నేను చూస్తుండగానే మరోటి వచ్చింది. నేను కాస్త సందేహిస్తూనే ఒక మెసేజ్ తనకు పంపాను. వెంటనే తను థాంక్స్ అని పంపింది. నేను ప్రశ్నార్ధకం పంపాను. ఆయన లేరని చెప్పి, ఇంట్లో ఏంటి స్పెషల్ అని అడిగింది. నా భార్య పిల్లలు గుడికి వెళ్ళి వుండటం తో నేను సంభాషణ కొనసాగించాను సరదాగా.

నాకు సెలవే నిన్న చెప్తే మీ ఊరు వచ్చేవాడిని కదా అన్నాను. ఇప్పుడైనా పర్లేదు వారం వరకూ రారు అనింది తను.

మీ వాడికన్నా ఏమి చేసి పెట్టేది లేదా? వాడిని అమ్మ తీసుకెళ్ళింది.

ఓ.. అయితే ఒక్కదానివే వున్నావా? ఊ...!

తోడు రానా మరి? నువ్వొస్తానంటే నేనొద్దంటానా?

నిజంగా వచ్చేస్తా. రమ్మనే చెప్తుంది.

ఇక ఆగలేక కాల్ చేసాను. తమది అపార్ట్మెంట్ కాబట్టి ఎవరూ పట్టించుకోరు అని అంది. నా మనసు ఉరకలేసింది. వెంటనే అర్జెంటు ఆఫీసు పని అని ఇంట్లో చెప్పి బయలుదేరాను. మధ్యాహ్నం ఒంటి గంటకి. తన ఊరు చేరేసరికి రాత్రి 9 అయింది. ఆటో తీసుకుని ఆమె చెప్పిన అడ్రస్ కి వెళ్ళాను. వాచ్మెన్ ఆపి వివరాలు అడిగాడు. ఆమె ముందుగానే చెప్పినట్లు తమ కింది ఫ్లాట్ పిల్లాడి ఫ్రెండు అని చెప్పాను. అతనికోసం ఎవరో ఒకరు వస్తుంటారట.

****************************************

ఎప్పుడో 8 ఏళ్ళ కిందట లేత యవ్వనపు తొలి సంధ్యలో జరిగిన పరిచయం మళ్ళీ ఇన్నాళ్ళకు ఇరువురం జీవితపు ప్రయాణం లో సగ భాగం దాటేసాక చిగురించింది. స్నానం చేసి ఒడిలో పడుకుని ఆమె చేతితో భోజనం చేస్తూ నాటి కబుర్లూ, నేటి పరిస్థితులు కలబోసుకునే సరికే అర్ధరాత్రి దాటేసింది. మునుపటి ఆత్రం లేకున్నా ఎన్నాళ్ళకో తెలిసిన ఊరు వెళితే పరిచయస్తులు మనమెరిగిన ప్రదేశాల కొరకు వెదికినట్టు ఆమెను అణువణువునా తడుముతూ సెయ్య చేర్చాను. అప్పటి ఆకృతిని తలచుకుంటూ ఇప్పటి ప్రకృతిని ఆక్రమించుకున్నాను. పూర్తిగా నా వశం అయిన ఆమె తనూలతికకు నేను దేవేంద్రుడయ్యాను. రెండోరోజు ఆఫీసు పని వుండడంతో తెల్లవారుజామునే బయలుదేరి పోవాలని సెల్లులో అలారం పెట్టుకున్నా. అది మ్రోగిన వెంటనే లేచి స్నానానికి నీళ్ళు పట్టుకుని వచ్చి తన్మయత్వం లో నిద్రిస్తున్న ఆమెను లేపాను. పోవద్దని మారం చేస్తూ నన్ను తన మీదికి లాక్కుంది. ఈ సారి తనంతట తానుగా తనను నాకు అర్పించుకుంది. సమయాభావం వల్ల ఆటాడుచు బాత్రూం లోనే మొహం కడుక్కుని నేను బయలుదేరి వచ్చేసాను. ఒక్కత్తే వుండలేక తాను కూడా తెల్లావారాక టిఫిన్ చేసి అమ్మగారింటికి వెళ్తానంది. ఆ ఊరిలో సిగ్నల్స్ అందవని చెప్పి, వీలున్నప్పుడు తానే రెండు రింగులు ఇస్తానంది. మధ్యాహ్నానికి చేరుకున్న నేను ఆఫీసుకు వెళ్ళిన వెంటనే ఫోను చేసాను. ఆమె అందుబాటులో లేదని తెలుసుకుని పుట్టిటికి వెళ్ళి వుంటుందనుకున్నా.

**********************************************

మంచాన పడ్డాక ఎప్పుడూ ఏదో దిగులుగా వుంటున్న మీ మావగారిని "ఏంటి మీ బాధ?" అని అడిగితే ఆయన నాకు చెప్పిన విషయం అది, ఆయన మాటల్లోనే..."

"మంచిగా అనుభవించాక కూడా ఆరోజును బ్బాధగా తలుచుకునేవారంటే.. అక్కడ ఏదో జరిగి వుంటది" లేచి ప్లేటులు పట్టుకుని వెళ్ళబోతూ మూతి వంకర్గా పెట్టి అన్నది కోడలు.

"ఆ..! ఆమె ఆ రోజు చనిపోయింది" అయ్యో! ఎలా?" మళ్ళీ కూర్చుంటూ అడిగింది."గ్యాసు బండ పేలి" అంటే...?" అర్థోక్తిగా ఆగిపోయింది కోడలు" "అవును! ఈయన నీళ్ళు పెట్టుకుని వెలిగించిన పొయ్యి విషయం మర్చిపోయి వచ్చేసారు. కొంతసేపటికి బాగా కాగిపోయిన నీళ్ళు బర్నర్ మీద పడి అది ఆరిపోయుంటది. కొంత సేపటి తరువాత ఆమెలేచి కిచెన్ లో లైటు వేసిందో , ఏమి చేసిందో గాని పేలిపోయింది. చాన్నాళ్ళ వరకు ఎదురుచూసిన ఈయన ఇక ఆగలేక తన స్నేహితుడికి ఫోను చేస్తే విషయం తెలిసిందట"

"అరె! అందుకు బాధపడేవారా? అలాగే జరిగి వుంటదని ఎందుకనుకోవాలి? ఆమెకు భూమి మీద నూకలు చెల్లిపోయాయి"

"ఆ రోజు అక్కడ బండ పేలడం నిజం. ఆమె మరణానికి కూడా అదే కారణం అని పోస్టుమార్టం రిపోర్టు తేల్చింది. అన్నిటికన్నా ముక్Yఅం ఆమె మరణ సమయం. ఈయన బయటకు వచ్చేసిన గంటలోపే అంటే అప్పటికి ఈయన ఆ ఊరి పొలిమేరలు కూడా దాటకముందే ఆమె... " మరింక పూర్తిచెయ్యలేదు అత్తగారు.

కొంతసేపటి తరువాత మళ్ళీ చెప్పనారంభించింది, "ప్రియ భర్త మళ్ళీ పెళ్ళి చేసుకోలేదుట. కొన్నాళ్ళు అమ్మమ్మ పంచన పెరిగిన త్తన కొడుకు ఆమె కూడా పోయాక హాస్టలుకు చేరాడట. ఈయన ప్రతి ఏడాది ఆ రోజున వాళ్ళింటి ముందుకు వెళ్ళి ఆ తండ్రి కొడుకులను చూసి వారి ఇల్లు విచ్ఛిన్నమవడానికి కారణం తనే అని బాధతో కుంగిపోయేరట. గుప్తంగా వారిరువురికీ ఎన్నో సహాయాలు చేసేవారుట, కానీ ఆయనకు మన:శాంతి వుండేది కాదుట. కొన్నాళ్ళకు తాగుడుకు బానిసయ్యి తండ్రి కూడా పోగా అనాధ అయిన ఆ పిల్లాణ్ణి ఎక్కడో విదేశంలో పనిచేసే మేనమామ తనతో తీసుకుపోయాడట. అతని యోగక్షేమాలు తెలియని మీ మావగారు ఎక్కడ వున్నా తనుబావుండాలని ఆ రోజు మౌన వ్రతం, ఉపవాసం చెయ్యనారంభించారట" ఇరువురూ ఒక్కసారిగా నిట్టూర్చారు.

"నాకీ విషయం తెలియక ముందు ఆయనతో సహగమనం చెయ్యమంటే మారుమాట్లాడక దూకేసేదాన్ని, కానీ ఆయన చెప్పాక నేను ఇంతలా నమ్మిన మనిషి నన్ను నోసం చేసాడని చాలా బాధపడ్డాను. ఆయన మీద ఏదో తెలిని కసిగా వుండేది. అలాగని నేను ఆయన పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం చూపించలేదు కానీ పరిపూర్ణంగా సేవ చెయ్యలేదని మాత్రం నా మనసుకు తెలుసు. అర్ధాంగిని నేనే సమ్యమనం చూపించలేకపోయాను ఇక ఈ విషయం తెలిస్తే పిల్లలు ఆయన పట్ల గౌరవ చూపించరి. అందుకే ఎవరికీ చెప్పలేదు. ఇప్పుడు కూడా నీకు నా కోడలిగా కాదు ఒక ఆడదానివిగా నా ఆవేదన అర్థం చేసుకుంటావని ఆశతో చెప్పాను. దీన్ని నీ గుండెల్లో దాచుకుంటావో లేక ధర్మరాజు శాపానికి మరో నిదర్శనం గా నిలుస్తావో నీ ఇష్టం" అని చెప్పి లేచివెళ్ళిపోతున్న అత్తగార్ని ఓ నిర్ణయానికి వచ్చి తల ఆడిస్తూ చూస్తుండిపోయింది కోడలు.




సిస్టం లో తలదూర్చి సీరియస్ గా పనిచేసుకుంటున్న నాకు, ఎదురుగా టేబుల్ మీదున్న ఫోన్ బీప్ సౌండ్ తో ఉలిక్కిపడి ఈలోకంలోకి వచ్చినట్టయ్యింది...రిసీవర్ ఎత్తి పట్టుకుని, " హలో " అన్నాను...అవతలి వైపు నుంచి రిసెప్షనిస్టు...." మేడం..మీ హజ్బండ్ లైన్లో ఉన్నారు..." అంటూ ఫోన్ ఆదిత్యకిచ్చింది...చాలా సాఫ్ట్ వేర్ కంపనీల్లోలాగే మా ఆఫీసులో కూడా మొబైల్ ఫోన్లు లోపలికి అలో చెయ్యరు....ఏదైనా అర్జెంట్ ఉంటే ఆఫీసుకి చేయాల్సిందే. ఇప్పుడింత అర్జెంటుగా చెయ్యాల్సిన అవసరమేంటాని ఆశ్చర్యపోయాను..." హలో...స్వాతీ....ఈరోజు వీలైతే పర్మిషన్ పెట్టి కాస్త పెందరాళే ఇంటికి చేరుకోగలవా..? అమ్మా-నాన్నా హైదరాబాద్ నుండి వచ్చారు...పక్క ఫ్లాట్ లో రిలాక్సయ్యారు టెన్షనేం లేదుగానీ...ఎంతసేపని వాళ్ళింట్లో ఉంటారు...??నాకేమో ఆఫీసులో కదలలేని సిచ్యుయేషన్ ఉంది..." అన్నారు ఆదిత్య. " అవునా...సరేనండీ....ఇప్పుడేగా లంచ్ హావర్ అయిపోయిందీ...హాఫ్ డే లీవ్ పెట్టేసి వెళ్తాలెండి " అని చెప్పి ఫోను పెట్టేసాను..మా పెళ్ళయి ఆర్నెల్లయింది..నాకు ప్రెగ్నన్సీ కంఫర్మ్ అని గుడ్ న్యూస్ తెలియగానే మా అమ్మా-నాన్నా వచ్చి వెళ్ళారు. హైద్రాబాద్ లో పనులూ అవీ చూసుకుని మా మామగారూ, అత్తగారూ ఈరోజే వచ్చారు. ఇద్దరమూ ఉద్యోగస్తులమే కావటంతో ఇంటి కీ చెరొకరి దగ్గర మాత్రమే ఉంటుంది..ఎవరైనా ఇంటికొస్తే రిసీవ్ చేసుకోవడానికి ఎవరో ఒకరం ఉండాల్సిందే....లీవ్ పెట్టేసి ఆటోలో ఇంటికి బయల్దేరాను...

**************************

నేను వచ్చిన అలికిడి వింటూనే పక్కఫ్లాట్ లో కూర్చుని మాట్లాడుతున్న అత్తయ్యగారూ, మామయ్య గారూ బయటికి

వచ్చారు..వాళ్ళను చూడగానే బాగున్నారా అత్తయ్యగారూ..అంటూ ఇద్దరి కాళ్ళకూ నమస్కరించాను...." ఏమ్మా ఎలా వున్నావు.." ఆప్యాయంగా పలకరించారు మామయ్య గారు... "ఆరోగ్యం ఎలా వుందమ్మా..." అత్తయ్య కళ్ళల్లో ప్రేమ, చదువుకుని ఉద్యోగం చేస్తున్న అమ్మాయైనా కించిత్ గర్వం లేదన్న మెచ్చుకోలు స్పష్టంగా కనిపించి..చాలా సంతోషం కలిగింది నాకు....

డోర్ లాక్ తీసాను...లోపలికెళ్ళి రిఫ్రెష్ అయి వాళ్ళ భోజనాలకు గబగబా వంటపని మొదలెట్టాను....

************

"ఏంటమ్మా.....ఇంతలోనే ఇన్ని ఐటంస్ రెడీ చేసేసావా....." డైనింగ్ టేబుల్ మీద నీట్ గా పెట్టి ఉంచిన డిషెస్ అన్నీ చూస్తూ అన్నారు మా అత్తగారు..

సంతోషంగా, ఒకింత గర్వంగా అనిపించింది ఆ ప్రశంసకి...." అవునత్తయ్యా "అన్నాను చిరునవ్వుతో...అవీ ఇవీ మాట్లాడుకుంటూ భోజనాలు కానిచ్చేశాము..

*************************

మా అత్తగారూ మామగారూ వచ్చి అప్పుడే నాలుగు రోజులు గడచిపోయాయి...

ఎవరిమటుకు వాళ్ళు ఆఫీసులకి వెళ్ళిపోతే వాళ్ళను కనిపెట్టుకుని ఉండేవాళ్ళు లేక బోర్ ఫీలవుతారని పదిరోజులు లీవ్ పెట్టేశాను. ఆదిత్య కంటిన్యూగా లీవ్ పెట్టకపోయినా అప్పుడప్పుడూ పర్మిషన్లు తీసుకుని త్వరగా వచ్చి అందర్నీ బయటికి తీస్కెళుతున్నారు...

ఉద్యోగం చేసే ఆడవాళ్ళు ఇంటిని సరిగా చూసుకోలేరనీ...ఈతరం అమ్మాయిలకి తమ చదువూ-కెరీర్ కంటే మరేదీ ముఖ్యం కాదన్న ఫీలింగ్ బహుశ అంతకుముందు ఉండేదేమో మా అత్తగారికి ఆ అభిప్రాయం కాస్తా నా దినచర్యనూ, ఇంటిని ఒంటిచేత్తో సరిద్దుకోవడమూ వాళ్ళకి అన్నీ అమర్చడమూ చూసింతర్వాత తొలగిపోయిందనిపిస్తోంది...

************

కిటికీ పక్కన బాల్కనీలో నిలబడి వాషింగ్ మెషీన్లో బట్టలు ఉతుకుతున్న నాకు బెడ్ రూం లోంచి అత్తయ్యా-మామయ్య గార్లు మాట్లాడుకుంటున్న మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి...

" ఏమండీ...మనమిక త్వరగా బయల్దేరి హైద్రాబాద్ వెళ్ళిపోదామండీ..." అంటున్నారు అత్తగారు...

" అదేమిటి...? కొన్ని రోజులు ఉండి వెళ్దామనుకున్నాం కదా..అప్పుడే తొందరేమొచ్చింది...?" అడిగారు మామగారు...అత్తయ్యగారేం చెబుతారో అని నాకూ కుతూహలంగా ఉంది...నావల్లేమైనా పొరపాటు జరిగిందా..? మర్యాదలో లోటేమైనా కలిగించానా....అని ఒక్క క్షణం గుండె దడదడలాడింది కూడా..

కానీ అత్తగారు చెప్పిన సమాధానం విన్న తర్వాత కలిగిన ఆనందం మాటల్లో చెప్పలేను..." అది కాదండీ...కొత్తగా పెళ్ళయిన జంట....నీళ్ళోసుకున్న కోడలు పిల్లకు నా చేతనైనదేదో చేసిపెడదామనుకుని వచ్చానా...తీరా ఇక్కడి వచ్చాక మనమే కూర్చుని తన చేత చేయించుకోవడానికొచ్చినట్లయింది...ఒక్క పనీ నన్ను ముట్టుకోనివ్వడం లేదు...నేనెంత ఉదయాన్నే లేచి ఏదైనా చేద్దామనుకొంటే తను అంతకంటే ముందే లేచి అన్ని పనులూ చేసుకుంటోంది..."

అది నిజమే...అయినా ఎంతమంది అత్తలు తమ కోడళ్ళ గురించి ఇలా పాజిటివ్ గా మాట్లాడతారు...అని అనుకుని పొంగిపోయాను..

మర్నాటినుండి మా అత్తగారి ప్రవర్తనలో విచిత్రంగా ఏదో మార్పు కనిపించింది....ముభావంగా ఉండడం...ఏదడిగినా " నీ ఇష్టమమ్మా....అలాగే చెయ్యి...సరే..." అనడం గమనించాను. ఎంత ఆలోచించినా కారణమేమిటో అంతు చిక్కలేదు నాకు....

******************

అదే ఆలోచిస్తూ పరధ్యాన్నంగా ఉన్న నన్ను మావారు " ఏమిటి రామయ్యా అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు? ఇంటికి పైకప్పు దేనిటొ వేద్దామనా" అని నవ్వుతూ అడిగారు..." లేదు సోమయ్యా అత్తగారి మనసులో ఏముందో తెలుసుకోవడామనీ..." నేను అన్నాను జవాబుగా...ఇందులో ఆలోచించడానికేముందీ? అమ్మనే అడిగితే సరిపోతుంది కదా" అన్నారు మావారు...కామెడీగా స్టార్ట్ అయినా మామధ్య ఈ విషయం సీరియస్ గానే చర్చకు దారి తీసింది...చివరగా..." పోనీ మీకైనా తెలిస్తే చెప్పండీ అత్తయ్య గారు ఎందుకలా ఉంటున్నారు? నావల్లేమైనా పొరపాటు జరిగితే సరిదిద్దుకుంటాను...." గద్గద స్వరంతో అడిగాను ఆదిత్యాని. ఏడుపొక్కటే తక్కువ నాకు...అలా వుంది...

నేనత సీరియస్ గా అడిగితే ఆయనేమో...చానల్ న్యూస్ రీడర్ లా పోజు పెట్టి...." కోడలికి శ్రమ కలిగిస్తున్ననని బాధ పడుతున్న అత్తగారు ఓ పక్క.....అత్తగారి మనసేమైనా నొప్పించానేమోనని బాధపడుతున్న కోడలు....ఆహా అత్త..ఓహో కోడలు...ఇద్దరిలో ఎవరికి మీరు మార్కులేస్తారు...." అన్నారు... ఆయనంత కామెడీగా దాటేస్తున్నా, నాకెందుకో ఆయనకి విషయమేదో తెలుసని అనిపించింది కానీ అడిగే ఓపిక లేక ఆయన కౌగిట్లో..నిద్రాదేవి ఒడిలోకి జారుకున్నాను....

***********************

కప్పుకున్న దుప్పటి తీస్తే ఒకటే చలి.....కడుపులోంచి చలి తన్నుకొస్తోంది. ఎవరో తలుపు తడుతున్నట్టు వినిపిస్తోంది కానీ లేవడానికి శరీరం స్వాధీనంలో లేదు...ఇంత రాత్రప్పుడు ఎవరబ్బా అనుకుంటుండగానే ఆయనెళ్ళి తలుపు తెరిచారు...అత్తయ్యగారు కాబోలు అడుగుతున్నారు.." ఆదీ...ప్రతిరోజూ ఇంతకన్నా ముందే లేచే కోడలు పిల్ల ఇవాళ లేవలేదేమిట్రా?" అని.. ఓ తెల్లారుతోందా..అయితే నేను రాత్రంతా ఇలాగే వణుకుతూన్నానా...." అనుకున్నాను....బహుశ ఆయన కూడా అత్తయ్య గారికి అదే మాట చెప్పినట్టున్నారు. నొచ్చుకుంటూనే అత్తయ్య లోపలికొచ్చి మంచం మీద కూర్చుని, నా నుదుటి మీద చెయ్యేసి " అయ్యో జ్వరం కాలిపోతోందిగా... అంటూ వెళ్ళి చల్లని నీళ్ళతో ఒళ్ళంతా తుడిచారు...గబగబా వంటింట్లోకి వెళ్ళి ఏవేవో కలిపి వేడివేడి కషాయం పెట్టి తీసుకొచ్చారు....చేదుగా వుంది నేను తాగనని మొరాయిస్తున్నా లాలించి తాగిస్తూంటే అత్తయ్యలో మా అమ్మే కనిపించింది నాకు...కాస్త నెమ్మదించినట్టనిపించి ఎప్పుడు నిద్రలోకి జారుకున్నానో తెలీదు...

********************

అమ్మాయ్....స్వాతీ...లేమ్మా లేచి బ్రష్ చేసుకో...జ్వరం పూర్తిగా తగ్గింది....వేడివేడి అన్నం...టమాటా రసం రెడీ చేసాను...తీసుకొస్తాను....తింటే జ్వరం టాబ్లెట్ కూడా ఇస్తాను నా తలమీద చెయ్యేసి లాలనగా అంటున్నారు అత్తగారు.... మెల్లిగా లేచి బ్రష్ చేసుకుని అత్తగారు కలిపి పెట్టిన అన్నం తిని టాబ్లెట్ వేసుకున్నాక రిలీఫ్ గా అనిపించింది...." ఈయన ఆఫీసుకి వెళ్ళిపోయారా అత్తయ్యా... బాక్స్ పెట్టి ఇచ్చారా..? " అనడిగాను...లేదమ్మా...వెళ్ళి సెలవు పెట్టి వచ్చేస్తానన్నాడు.. బహుశ

ఈపాటికి రావచ్చు...మీ మావగారు కూడా వాడితోనే కలిసి బయటకెళ్ళారు అని చెప్పారు అత్తయ్య. ఇంతలో నా సెల్ ఫోన్ రింగయ్యింది..చూస్తే ఆయనే....మాట్లాడే ఓపికలేదన్నట్లు మొహం పెట్టేసరికి అత్తయ్యే లిఫ్ట్ చేసి మాట్లాడారు.. లీవ్ పెట్టడం కుదరలేదని చెప్తున్నట్టున్నారు ఆయన..నాకెలా ఉందని అడిగినట్లున్నారు. ఏం పర్లేదు నాయనా...నేను చూసుకుంటాగా...నువ్వేం టెన్షన్ పడకు...జ్వరం కూడా తగ్గింది..కషాయమూ, టాబ్లెట్ అన్నీ పడ్డాయిగా..ఏం భయపడనక్కర్లేదులే... అని చెప్పి పెట్టేసారు. ఇంట్లో జ్వరం టాబ్లెట్లు ఉండగా అత్తయ్య గారు నాకు కషాయమెందుకు కలిపిచ్చారో నాకర్థం కాలేదు...ఏమనుకుంటారో అని భయమనిపించినా అడిగేశాను అదేమాట. పెద్ద కారణమేం లేదమ్మా....ముందుగా మన ఒంట్లోనే తట్టుకునే శక్తి కొంత ఉంటుంది. కానీ కొంత వ్యవధి ఇవ్వాలి. లేదా సహజంగా సాంత్వన కలిగించే లక్షణాలున్న ఇంట్లోని దినుసులతో కాస్త ఉపశమనం కలిగించవచ్చు.... అలా కాక ఏమాత్రం చిన్న చిన్న ప్రాబ్లంస్ వచ్చినా అమాంతం టాబ్లెట్లతో మటుమాయం చేసేసుకోవాలనుకుంటే మాత్రం రోగనిరోధక శక్తిని కోరి నిర్వీర్యం చేసుకున్నట్టే...." కొత్తగా అనిపించింది....ఏదొచ్చినా ఏ కార్పొరేట్ క్లినిక్ కో వెళ్ళడం వాళ్ళిచ్చిన మందులు మింగడమే కానీ ఇలా ఎప్పుడూ ఆలోచించలేదు...అత్తయ్య గారిలో ఒక ఫ్యామిలీ డాక్టర్ కనిపించారు నాకు...కాలింగ్ బెల్ శబ్దం వినిపించి లేవబోయేసరికి నన్ను వారించి అత్తయ్య గారే వెళ్ళి తలుపు తీసారు... కిరాణా షాపు వాడు సామాన్లు తెచ్చినట్టున్నాడు..మెల్లిగా వెళ్ళి హాల్లో సోఫాలో కూర్చున్నాను..." ఎంతయింది " అనడిగి కాష్ తెచ్చివ్వబోయాను.. నన్ను ఆగమని అత్తయ్య గారు కిరాణా షాపు అబ్బాయి చేత ఒక్కొక్క వస్తువూ తీసి లెక్క మరోసారి వేయించేసరికి దాదాపు రెండు వేలు తేడా వచ్చింది....ఇలా అయితే ఇంకోషాపు నుంచి తెప్పించుకుంటాము...ఈసారి నుంచి లెక్కలు సరిగ్గా వెయ్యి అని వాడిని మందలించి డబ్బులిప్పించి పంపేసారు అత్తయ్య...ఇలా వాడెప్పుడూ నిలదీసింది లేదు... ఫైనల్ అమౌంట్ ఎంతయిందో అడిగి వాడెంత చెప్తే అంతా ఇచ్చి పంపెయ్యడమే తెలుసు నాకు. ఆశ్చర్యంగా చూస్తున్న నాకు అత్తయ్య గారు ఇలా చెప్పరు...చూడమ్మా...సంపాదించడంతోబాటు సద్వినియోగం చేయడమూ ముఖ్యమే... ఇవాళంటే వస్తోంది కాబట్టి లెక్కలు చూసుకోకుండా ఖర్చులు పెట్టేస్తారు..రేపు నీ డెలివరీకి లీవ్ పెడతావనుకో..ఆర్నెల్లో..సంవత్సరమో..అప్పుడు ఒక్కడి జీతమేగా వచ్చేదీ....ఇప్పట్నుంచే అన్నిట్లో కాస్త చెయ్యి వెనక్కి లాగాలమ్మాయ్"...అత్తయ్యగారు చెప్తుంటే ఆవిడలో ఒక గొప్ప ఫైనాన్షియల్ ప్లానర్ కనిపించారు నాకు....నా ప్రశ్నలకు మెల్లిగా సమాధానం లభించినట్లే అనిపించింది....వచ్చినప్పట్నుంచి ఆవిడను చేతకాని ముసలావిడలా భావించి కూర్చోబెట్టి అన్నీ చేసుకుపోతున్నానే కానీ, ఆవిడ నుంచి ఏ సలహా తీసుకోలేదు... నేర్చుకోవడానికి ప్రయత్నించలేదు..బహుశ అత్తయ్య గారి ఆత్మాభిమానం దెబ్బతినడానికి, ముభావంగా ఉండడానికీ కారణం ఇదేనేమో....సంసారంలో, వ్యవహారంలో ఆవిడ నాకన్నా సీనియర్...ఎంతయినా అత్తయ్య గారినుంచి నేను నేర్చుకోవాల్సింది చాలా ఉంటుంది...కాలం మారినా పరిస్థితులు మారినా సంసార-వ్యవహారాలు చక్కబెట్టుకునే లౌక్యం చాకచక్యం ఎప్పుడూ ఒకలాగే ఉంటుంది....ఇవన్నీ ఆవిడ ఎప్పుడో చూసేసిన పరిస్థితులు.....అమాంతంగా అత్తగారు చాలా ఉన్నతంగా కనిపించారు..మా అమ్మలాగా...క్లాసులో టీచరు లాగా...

************************

"ఏమండీ ఏం మాట్లాడరేమిటీ నేను అడిగిందానికి....? "

నిలదీసాను ఆయన్ని....

" ఏం మాట్లాడమంటావు స్వాతీ...అన్నీ నువ్వే గ్రహించావు...నువ్వే సరిదిద్దుకున్నావు.."

అయితే ఆరోజు రాత్రి ఆయనకేదో తెలుసని నా మన్సు గ్రహించిన నిజం ఇదేనేమో...

మళ్ళీ ఆయ్నే అన్నారు..

చూడు స్వాతీ..మా చిన్నప్పట్నుంచి మా నాన్నకి ఉద్యోగానికి వెళ్ళి రావడం, వచ్చిన జీతం అమ్మ చేతికివ్వడం తప్ప ఏ వ్యవహారాలూ పట్టేవి కావు. అన్నీ అమ్మే చూసుకునేది... ఎవరికేది కావాలో ఆమెకు బాగా తెలుసు....ఒక రకంగా బొమ్మరిల్లు ఫాదర్ లాగా బొమ్మరిల్లు మదర్ అనుకో.......ఏమీ చెయ్యని వాళ్ళకి చెయ్యమంటే నచ్చదు.. కానీ అందరికీ అన్నీ అమర్చిన మా అమ్మ లాంటి వాళ్ళకి నువ్వు ఇల్లు చక్కబెట్టుకుంటుంటే, ముందు సంతోషం కలిగినా తన ఉనికిని ఏమాత్రం గుర్తించకపోవడం బాధే కలిగిస్తుంది....అలాగని అయినదానికీ కానిదానికీ కోడలిని తప్పు పట్టి సాధించే మనస్తత్వం కాదు గనక తనలో తానే బాధపడింది....."

గట్టిగా నిర్ణయించుకున్నాను....ఆవిడను గౌరవించి..ఆవిడనుంచి నేర్చుకుంటూనే...ఆవిడకే ఇబ్బందీ రాకుండా చూసుకోవాలని...అలా నిర్ణయం తీసుకున్నాక నా మనసు తేలయింది...




సోల్జర్ శీనివాస్! తన భర్త.

దేశంకోసం అనుక్షణం తపిస్తూ, దేశరక్షణలో సరిహద్దు వెంబడి పహారా కాస్తూ శత్రు సైనికుల చొరబాటును నిరోధించే పులి.

తన పెళ్లై ఏడాదయింది. శీనివాస్ సెలవు మీద వచ్చి హడావుడిగా తనను చుసి, మూడుముళ్లేసి సొంతం చేసుకుని, మూడు రాత్రుల మధురిమను తన గుండెల్లో ప్యాక్ చేసి మళ్లీ వస్తానని చెప్పి డ్యూటీలో జాయినైపోయాడు.

అప్పటినుంచి పున్నమిరాత్రి, విచ్చిన పువ్వులు, మంచి గంధం లాంటివన్నీ శ్రీనివాస్ గాఢ పరిష్వంగం గుర్తుచేసి, మనసును పిచ్చెకిస్తుండేవి. స్నానిస్తున్నప్పుడు, బట్టలు కట్టుకుంటున్నప్పుడు శరీరంలోని అణువణువూ అతను కేంద్రీకరింపజేసిన స్పర్శానుభూతులు గిలిగింతలు పెడుతూండేవి. ఏం చేయగలం? దేశాన్ని కాపాడ్డం అతని విధి. తనకు, అతనికోసం విరహోత్కంఠితలా ఎదురుచూసే శిక్ష విధించింది విధి.

రేపు తెల్లారితే ఉగాది.

ఎండలు మండిపోతున్నా, చెట్లు లేచివుళ్ల దుస్తులేసుకుని, విరిసిన పుష్పాలతో గాలి తెమ్మెరలపై సయ్యాటలాడుతున్నాయి.

మామిడి చెట్లకున్న పిందెలు చెట్లకి కొత్తందాన్ని సంతరింపజేశాయి. వేప చెట్లు తెల్లటి పూతతో వెలుగులో కూడా వెన్నెల ముసుగేసుకున్నట్టున్నాయి. కోకిల కమ్మని కూజితాల భావగీతాలు అందరి మనసుల్నీ మైమరపిస్తున్నాయి. కొత్త సంవత్సరపు మొట్టమొదటి పండగ, అంతేకాకుండా నా పెళ్లై సంవత్సరం కూడా కాలేదు అంచేత మా ఇంటికి కూడా నాన్న పేయింట్లేయించి తోరణాలు కట్టించాడు.

"పెళ్లయిన తర్వాత మీ జంటకి వచ్చిన మొదటి ఉగాది పండగ, అల్లుడుగారు సెలవు దొరకలేదన్నాడు కాని ఎలాగైనా వీలు చూసుకుని వస్తే ఎంతబావుండేది?"అన్నాడు మైథిలీ తండ్రి భూషణ్ రావుగారు.

"ఆ(..నేను ముందే చెప్పాను మిలట్రీలో పనిచేసే అతనికి మనం పిల్లనివ్వొద్దని. విన్నారు కాదు. తండ్రీ కూతుళ్లిద్దరూ వంత పాడుకుని నా నోరు మూయించి మరీ ఒప్పుకున్నారు. చిలకా గోరింకల్లా అలా అలా తిరుగుతూ అచ్చటా ముచ్చటా తీర్చుకోడానికి అతనికి ఓ సెలవు దొరకదు. అమ్మాయిని కాపురానికి తీసుకెళ్లలేడు. ఒకవేళ ముందు ముందు తీసుకెళ్లినా ఏ ఊళ్లో అమ్మాయి ఏం కష్టపడుతోందో అని నా మనసంతా ఒకటే బెంబేలెత్తిపోతుంటుంది. ఇంకా పెళ్ళయి సంవత్సరమైనా కాలేదు, ఇంతకు ముందు పండగల్లానే, అల్లుడు గారు ఈసారీ రాలేకపోయారు." కూతురి పట్ల మమకారాన్నీ మాటల్లో బాధగా వ్యక్తం చేసింది సోమిదేవమ్మ.

మైథిలి కంటి కొలనుల్లో ఒక బాష్పం అసంకల్పితంగా చోటుచేసుకుంది.

*****

తెల్లవారు ఝామున నాలుగు గంటలు!

ఇంటి తలుపు టక టక చప్పుడయింది.

పాలేరు పాండురంగడు ఎవరా? అనుకుంటూ తలుపు తెరచి..‘అయ్యగారూ అల్లుడు గారొచ్చేరండోయ్’ అని గట్టిగా అరిచాడు. ఆ ఇంటికి పూర్తిగా తెల్లారిపోయింది.

ఆరడుగుల ఆజానుబాహుడు, అరవింద దలాయతాక్షుడు, అందగాడు శ్రీనివాస్ తన సూట్‌కేస్ తో లోపలికి అడుగెట్టి "హైద్రాబాదు ఆఫీసులో ఒక కాన్ఫిడెన్సియల్ డాక్యుమెంట్ సబ్మిట్ చేయడానికి రెండురోజులు వెళ్లమంటే..నేను పండగ కోసం అతికష్టం మీద మరో రెండురోజులు తీసుకుని ఇక్కడికి వచ్చాను"అన్నాడు.

"రావయ్యా..రా..పండక్కి రావేమోనని ఎంతో భయపడిపోయాం. అమ్మాయయితే మీకోసం ఒళ్లంతా కళ్లుచేసుకుని కలలు కంటోంది. తనని అలా చూస్తుంటే మాకెంత బాధ కలిగేదో! మొత్తానికి మీరొచ్చారు మాకదే సంతోషం. మా ఇంటికి ఉగాది వచ్చేసింది. అమ్మాయ్! అల్లుడుగారికి కాళ్లు కడుక్కోడానికి చెంబుతో నీళ్లిచ్చి మీ గదిలోకి తీసుకెళ్లు..ప్రయణ బడలిక పోయేదాకా రెస్ట్ తీసుకుంటారు"అన్నాడు.

మైథిలి సిగ్గుల మొగ్గై, తనువూ మనసూ పురి విప్పిన నెమలి అవుతుంటే భర్త వంక వాలు చూపులు చూస్తూ చెంబుతో నీళ్లు, తుడుచుకోడానికి టవల్ ఇచ్చింది.

ముఖం కాళ్లూ చేతులూ కడుక్కున్న శ్రీనివాస్ భార్య వెంట తమ గదిలోకి వెళ్ళాడు. అప్పటి దాకా చిన్నగా భార్యను అనుసరించిన శ్రీనివాస్ గదిలోనికెళ్లంగానే గొళ్ళెం వేసి మైథిలిని గట్టిగా ఆలింగనం చేసుకుని అనువణువును ముద్దులతో ముంచెత్తసాగాడు. అసలే బలాఢ్యుడు, ఆపై మిలట్రీలో కండపుష్టి పెంచుకున్నవాడు. పరిపూర్ణ మగాడు. మన్మధుడు అతన్ని పూర్తిగా ఆవహించాడు. అతని ప్రేరేపణకు ఆమె మొగ్గ దశ నుంచి క్రమ క్రమంగా విరిసిన పువ్వవుతూ సంపూర్ణంగా సహకరించసాగింది. అనుభూతులు..మధురానుభూతులై..మనసు మూలల్లో మల్లెల పేటికల్లో కమ్మటి స్మృతుల్లా పేరుకుపోతున్నాయి.

చాలాకాలం తర్వాత చెలియలికట్ట దాటిన యవ్వనోద్రేకం, క్షణం వృధాకానివ్వడం లేదు..అలా మూడు నాలుగు సార్లు మన్మధసామ్రాజ్యాన్ని ఏలిన తర్వాత ఇద్దరూ నిద్రలోకి జారుకున్నారు.

మధ్యాహ్నం పన్నెండు గంటలకు ఇద్దరికీ మెలకువ వచ్చింది. ఊళ్లలోని ఇళ్లలో అటాచ్డ్ బాత్రూమ్స్ ఉండవు కాబట్టి, హడావుడిగా బట్టలు సవరించుకుని తలుపు తీసుకుని బయటకు తుర్రుమంది మైథిలి. ఆ వెనకే తలొంచుకుని బయటకొచ్చాడు

శ్రీనివాస్.

అందరూ గుంభనగా వాళ్లిద్దరివంకా చూసి చిన్నగా నవ్వుకున్నారు.

తలంట్లూ, కొత్తబట్టల పర్వాలయ్యాక దగ్గర్లోని శ్రీ వేణుగోపాల స్వామి గుడికి వెళ్లి అర్చన చేయించుకుని అక్కడి ఉగాది పచ్చడి ప్రసాదంగా తీసుకుని ఇంటికొచ్చారు. ఇంట్లో తయారు చేసిన ఉగాది పచ్చడిలో కాస్తంత బెల్లం ఎక్కువేసి "అల్లుడుగారూ, మీరు హఠాత్తుగా వచ్చి మాకు పండగ మధురానుభూతిని ఘనంగా పంచారు. సంవత్సరమంతా ఇలాగే మధురంగా ఉండాలని ఉగాది పచ్చడిలో కాస్త తీపెక్కువేశాను"అంది సోమిదేవమ్మ.

సాయంత్రం గుడికెళ్లి పంచాంగ శ్రవణం విన్నారు. అందరి రాశిఫలితాల్లో ఆదాయం, ఆనందపుపాళ్లెక్కువే ఉన్నాయి. సంతోషం మిన్నంటింది.

ఆరాత్రి మళ్లీ ఆగని వాళ్లిద్దరి సమాగమానికి సిద్ధమైంది. అలుపెరుగని అనుభూతుల పోరులో ఇద్దరూ స్వర్గపుటంచులు చూశారు.

రెండురోజులు రెండు క్షణాల్లా గడిచిపోయాయి. మరో కొద్దిసేపట్లో శ్రీనివాస్ హైద్రాబాదుకి బయల్దేరుతాడు.

అందరూ అతనికి వీడ్కోలు పలకడనికి సిద్ధమవుతున్నారు. అందరి మనసులూ ఉదాసీనంగా ఉన్నాయి. మైథిలిదైతే చెప్పనక్కర్లేదు..ప్రాణమే విడిపోతున్నంత బాధ ముఖంలో ద్యోతకమవుతోంది.

"అల్లుడుగారూ..మీరసలు వచ్చినట్టే లేదు. పండగ సంబరన్ని మీతో తెచ్చి మళ్లీ తీసుకుపోతున్నట్టు ఉంది, మళ్లీ ఎప్పటికొస్తారో "అన్నారు మామ, అత్తగార్లు.

"ఈ ఉగాది తర్వాత మరో పండగొస్తోంది. రెండునెలల్లో నాకు కశ్మీర్ నుంచి హైద్రాబాదుకు ట్రాన్స్ఫర్ ఉంది. అక్కడే మా కొత్తకాపురం. ఈ ఊరు నుంచి జస్ట్ సిక్స్ అవర్స్ జర్నీ..అందరూ హాప్పీయేగా, అసలు ఈ విషయం సస్పెన్స్ గా ఉంచుదామనుకున్నాను.. కానీ మీ అందరి బాధ ముఖ్యంగా నా స్వీట్ హార్ట్ మైథిలీ వేదన చూసి చెప్పెయ్యాలనిపించింది. సో..మళ్ళీ త్వరలోనే మనందరం కలుస్తాం..ఒకే.."అని కారెక్కేశాడు.

అందరూ ముఖాలూ ఆనంద జ్యోతులయ్యాయి..చేతులూపుతూ వీడ్కోలు చెప్పారు. మైథిలి మాత్రం చిరుసిగ్గుతో, కళ్లతో ఏదో స్వీట్ నథింగ్స్ చెప్పింది అది కారు రేర్ వ్యూ మిర్రర్ లోంచి చూసి అర్ధం చేసుకున్నాడు సోల్జర్ శ్రీనివాస్.

*****




ఆగకుండా మోగుతున్న సెల్ కోయిల కూతతో నిద్రాభంగం అయింది... సమయం ఎనిమిది గంటలని ఎదురుగా ఉన్న గడియారం చూపిస్తోంది...బారెడు పొద్దెక్కిన విషయం కిటికీలోంచి బెడ్ మీదికి పడ్తున్న సూర్య కిరణాలను చూస్తే తెలుస్తోంది....ప్చ్... రాత్రి సినిమా స్టోరీ సిటింగ్ వల్ల బాగా లేటుగా వచ్చాను...

హాల్లోకి వచ్చేటప్పటికి ఇద్దరు పిల్లలూ కనబడ్డారు... శుభ్రంగా తలంటు పోసుకొని, కొత్త బట్టలు కట్టుకుని... శ్రద్ధగా... వేప పూత వొలుస్తూ... అప్పుడు గుర్తుకొచ్చింది... ఇవాళ ఉగాది పండుగ అన్న విషయం...పిల్లల కన్నా ఆలస్యంగా నిద్ర నుంచి లేవడం... అందునా పండుగ రోజున... ఎందుకో గిల్టీగా అనిపించింది.. దేవుడి గదిలోంచి వస్తున్న అగరొత్తుల వాసన, వినిపిస్తున్న ఘంటా నాదం ఆ గిల్టీనెస్ మరింత పెంచాయి..

కాఫీ కోసం నాలుక పీకుతున్నా...పండుగ రోజు కూడా బెడ్ కాఫీ అంటే శ్రీమతి చూసే చూపు గుర్తొచ్చింది... దాంతో బలవంతంగా బాత్రూం లోకి దూరి, షాంపూ స్నానంతో బయటకు వచ్చాను...శ్రీమతి గొంతులోంచి శ్రావ్యంగా లలితా సహస్ర నామ పారాయణం

వినిపిస్తోంది... అందుకని ఎక్కువ శబ్దం కాకుండా వంటింట్లోకి దూరి, కాఫీ కలుపుకొని హాల్లోకి వచ్చాను... అలవాటు ప్రకారం టి.వి. ఆన్ చేసి న్యూస్ విందామంటూ కూర్చున్నాను... పూజ పూర్తయిన మా ఆవిడ తులసి కోట దగ్గరకు వెళుతూ "ఈరోజు పండగ... గుర్తుందిగా..." అంది... దాని అర్థం "ఇవాళైనా పాడు న్యూస్ వదిలేసి పూజ చేసుకోండి" అని.. ఏమాటకామాటే చెప్పుకోవాలి... నా శ్రీమతి టి.వి. చాలా తక్కువగా చూస్తుంది... చాగంటి వారిదో, గరికపాటి వారిదో పురాణ కాలక్షేపం వస్తే మాత్రం వదలదు.. సీరియల్స్ జోలికి మాత్రం చస్తే వెళ్ళదు... ఇది తెలిసిన మా స్నేహితులందరూ 'నీ అంత అదృష్టవంతుడు ఈ తెలుగు దేశంలొ లేడోయ్' అంటుంటారు. ఆఖరుకి నేను రచనా సహకారం అందించిన సీరియల్సు, సినిమాలను కూడా పట్టించుకోదు...'ఏముంది? ఒక పుణ్యమా... పురుషార్థమా...' అంటూ తీసి పారేస్తుంది.. కూడు పెడుతున్న వాటిని, అందునా నా సాహితీ పటిమని గుర్తించక పోవటం ఉక్రోషం కలిగించినా, వాస్తవానికి నాదీ అదే అభిప్రాయం కావటంతో.. మరేమీ అనను.

కాఫీ తాగటం పూర్తి చేసి, దేవుడి గదిలోకి దూరాను. పట్టు పంచె కట్టుకొని అందంగా అలంకరించిన దేవుడి మందిరం ముందు కూర్చొని ఒక అరగంట పాటు పూజాదికాలు కానిచ్చాను ... మనసుకు నిజమైన ప్రశాంతత, తనువుకు పవిత్రత అప్పుడే చేకూరినట్టనిపించింది... ఈ నగర జీవితంలో పనికి మాలిన వ్యవహారాలన్నింటికీ సమయం ఉంటుంది గానీ, దేవుని ముందు కూచోవాలంటే పట్టుమని పది నిముషాలు కూడా దొరకదు... ఈ రోజు ఉగాది కనుక, ఇవాళ్టి నుంచైనా జీవన శైలి మార్చుకోవాలి అని గట్టిగా అనుకున్నాను... మరో పక్క మనసు 'ఈ నిర్ణయం గతేడాది అనుకున్నదే.... కుక్క తోక వంకర...' అని వెటకారం చేస్తూనే ఉంది.

పూజ అయిన వెంటనే.. శ్రీమతి ఇచ్చిన ఉగాది పచ్చడిని ప్రసాదంగా స్వీకరించాను. షడ్రుచుల సమ్మేళనంతో, జీవితానుభవాలన్నిటినీ సమ దృష్టితో తెలియ జేసే ఇటువంటి గొప్ప పండుగ బహుశా ఏ యితర ప్రాంతంలోనూ, ఏ యితర దేశంలోనూ లేదేమో... అనిపించింది....

ఎడ తెరిపి లేకుండా లేండ్ లైను, మొబైల్ ఫోన్లు మోగుతూనే ఉన్నాయి... ఉగాది శుభాకాంక్షలు చెప్పే బంధువులు, సన్నిహితుల కాల్స్ తో... హేపీ టెల్గూ న్యూ యియర్, హేపీ ఉగాడీ అంటూ వచ్చే మెసేజ్ లతో మొబైల్సు మాటి మాటికీ కుయ్ కుయ్ మంటున్నాయి. ప్రొడ్యూసర్ గోపాల్ నుంచి ఫోన్... కొత్త సినిమా స్టోరీ సిట్టింగు కోసం నగరం బయట్ రిసార్ట్స్ బుక్ చేసామని, మధ్యాహ్నం నుంచే రావాలని... సరే.. అనే లోపు గుర్తొచ్చింది - ఈ రోజు సాయంత్రం రవీంద్ర భారతిలో సాంస్కృతిక శాఖ వారి ఆధ్వర్యంలో జరిగే ఉగాది ఉత్సవాలలో కవి సమ్మేళనంలో పాల్గొనాల్సి ఉందన్న విషయం. అదే విషయం ఆ నిర్మాతకి చెప్పాను... అన్యమనస్కంగా సరే అంటూ... రేపటి నుంచి ఇక ఏ యితర కమిట్మెంట్సు పెట్టుకోమాకండి... స్టోరీ సిట్టింగ్ తొందరగా ముగించాలి మనం.... అన్నాడు. సరే అన్నాను.

సాధారణంగా 'కవి సమ్మేళనాల' వంటి కార్యక్రమాలకి దూరంగా ఉంటాను... సమయం వృధా... పైగా.. ఆర్థికంగా ఏ ప్రయోజనం ఉండదు.. మహా అయితే ఒక శాలువా కప్పడం తప్ప... కానీ, ఉగాది ఉత్సవాలు.. అందులోనూ ప్రభుత్వం తరపున కావటంతో

మంత్రులు, ఉన్నతాధికారులు చాలామంది పాల్గొంటారు… ఆ పరిచయాలు తర్వాత తర్వాత ఉపయోగపడ్తాయి… అనే ఉద్దేశ్యంతో సాంస్కృతిక శాఖ వారు అడిగినదే తడవుగా సరే అన్నాను.

అంతలో ఫోన్ మళ్ళా మోగింది… పిల్లలు తీసారు… అమ్మా .. మామ్మ నుంచి ఫోను.. అంటూ వంటింట్లోకి పరుగుతీసారు… మా అమ్మ నుంచి ఫోను అయినా … ముందు నా శ్రీమతే మాట్లాడి, తర్వాతే నాకు ఇస్తుంది… ముందు నేను మాట్లాడితే ఏదో ముక్తసరిగా మాట్లాడి, పెట్టేస్తానేమోనని ఈ ఏర్పాటు… పైగా అత్తా కోడళ్ళు ఇద్దరూ ఒక పార్టీయే…శ్రీమతి మాట్లాడటం అయి పోయాక పావు గంటకి ఫోను నా చేతికి వచ్చింది… ఉగాది శుభాకాంక్షలు నాయనా.. నువ్వు ఎలా ఉన్నావు… ఆరోగ్యం ఎలా ఉంది? ఈ మధ్యన లేటుగా వస్తున్నావట రాత్రుళ్ళు… అంటూ గుక్క తిప్పుకోకుండా అడిగింది… నేను బాగానే ఉన్నానమ్మా… నువ్వు ఎలా ఉన్నావు.. ఊర్లో అందరూ ఎలా ఉన్నారు? అంటే.. నాకేం నాయనా నిక్షేపంగా ఉన్నాను… ఊర్లో అందరూ బాగున్నారు… ఉంటాను నాయనా… జాగ్రత్త… అని ఫోను పెట్టేసింది…

అమ్మకు నామీద ఉన్న కోపం చెప్పకనే చెప్పినట్లనిపించింది. ఊరికి నన్ను రమ్మంటుంది… ఊరు వదిలి తనని రమ్మంటాను… ఇద్దరి మధ్యా ఆ ఒక్క విషయం పైనే ఎప్పుడూ గొడవ.. అందుకని ఆమెను మాటల్తో నేనేం బాధ పెడతానో అని, మా ఆవిడే అమ్మతో ఎక్కువ ఫోను చేస్తుంటుంది… వీలున్నప్పుడల్లా ఊరు వెళ్ళి కలుస్తుంటుంది.

అమ్మతో ఫోను మాట్లాడిన తరువాత, ఉగాది పండుగ నాడు - పండు ముత్తయిదువ లాగా ముస్తాబయ్యే మా ఊరు గుర్తొచ్చింది. మాది - కోనసీమలోని శ్రీరామ పురం అగ్రహారం… నాన్నగారు వేద పండితులు… ఘనాపాఠి. అంతే కాదు, గొప్ప పౌరాణికులు కూడా… దురదృష్టమో నాన్నగారు శ్రద్ధ పెట్టక పోవడమో.. కారణమేదైనా గాని, మా అన్నదమ్ములెవ్వరికీ ఆ వేద విద్య అబ్బలేదు. లౌకిక విద్యలో, ఉద్యోగాల వేటలో తలో మూలకి చేరుకున్నాం.. శ్రీరామ నవమికైతే మా రామాలయంలో సీతారాముల కళ్యాణానికి గ్రామమంతా - చిన్నా పెద్దా తేడా లేకుండా హాజరయ్యేది.. ఆహితాగ్నులైన అగ్రహారీకులు మొదలు అందరూ సహ పంక్తి భోజనాలు చేసేవారు… ఎవరి ఆచార సంప్రదాయాలు వారు పాటిస్తూనే.. ఇతరులను గౌరవించే గొప్ప సంస్కృతి ఉండేది.

తెలుగు పండిట్ కోర్సు చేసిన వెంటనే ఊళ్ళో తెలుగు పండితునిగా ఉద్యోగం చేస్తున్న నాకు, అనుకోకుండా సినీ రచయితగా అవకాశం దక్కింది.. నేను రాసిన నాటకాలకు నంది అవార్డులు రావడంతో, సినీ రంగం నుంచి పిలుపు రావడం, ఉత్సాహంగా దాన్ని నేను అందిపుచ్చుకోవడంతో హైదరాబాదులో స్థిర పడి పోయాను… మొదట్లో శెలవులలోనో లేక శెలవులు పెట్టుకునో ఈ రంగంలో పని చేసిన నాకు, అవకాశాలు అధికంగా వస్తూండటం, ఆదాయానికి ఢోకా లేకపోవడం, అన్నిటికీ మించి ప్రతి వారినీ ఊరించే రంగుల సినిమా ప్రపంచం దగ్గరవటంతో… ఉద్యోగానికి రాజీనామా చేసి, పూర్తిగా నగరానికే అంకితమయి పోయాను. సాహిత్య రంగంలో నా ప్రవేశాన్ని నాన్న గారు అభినందించినా, సినిమా రంగ ప్రవేశాన్ని హర్షించ లేక పోయారు.. కాని, ఏనాడూ తన అభిప్రాయాన్ని మాపై రుద్దే తత్వ కాక పోవటంతో… నాకు అది ఒక రకంగా అర్ధాంగీకారం గానే తోచింది.

సినిమా కథల సిట్టింగులకు ఒక టైమంటూ లేక పోవటం, ఒక ప్లేసంటూ కాకుండా అన్ని చోట్లకీ తిరగాల్సి రావడంతో... మా ఊరికి వెళ్ళడం రాన్రానూ తగ్గి పోయింది. పల్లె అందాల గురించి, పల్లెటూరి ఆత్మీయతల గురించి కవితలు, కథలు రాస్తున్నా, వాస్తవానికి వాటన్నింటికీ దూరంగా బతుకుతున్నానని, తెలిసి, అప్పుడప్పుడు మనసు అపరాధ భావనతో మూలుగుతుంది... మళ్ళీ కవితా గోష్ఠులు, కథా చర్చలతో కాలం పరిగెడుతూనే ఉంటుంది... అందులోనూ, నాన్నగారు పోయాక, ఊరికి వెళ్ళడం మరీ తగ్గి పోయింది. గత పదేళ్ళుగా కేవలం నాన్నగారి ఆబ్దీకానికి, అది కూడా పొద్దున్న బస్సుకి దిగి, సాయంత్రానికి ప్రయాణం కావడం జరుగుతోంది... ముత్తాతల నాటి పెద్ద మండువా ఇల్లు పాడై పోతోందని అమ్మ బాధ పడుతున్నా, అందరం తలో చోటా. తలో ఇల్లూ కట్టుకుని సెటిలై పోవటంతో, మా అన్నదమ్ములకు ఆమె బాధ పట్టించుకునే ఆసక్తి, తీరిక కొరవడ్డాయి.

తెలిసిన వాళ్ళు ఎవరయినా, 'మీరు ఉండనప్పుడు అయిన కాడికి అమ్మెయ్యొచ్చు కదా' అని అంటే, ఆ మాట సరదాకి కూడా మా అమ్మ దగ్గర ప్రస్తావనకి తెచ్చే ధైర్యం కూడా లేదు.. ఆ యింటి ఆత్మీయతలు, మండువా లోగిలి ముచ్చట్లు, వంటింటి సందళ్ళు, మూడు తరాలను చూసిన ఉయ్యాల బల్ల చేసే కిర్రు కిర్రు శబ్దాలు అమ్మకి తియ్యని అనుభూతులు... జ్ఞాపకాలు... అందుకే.. వయసు మీద పడినా, ఊరి వారి స్నేహంతో, దూరపు బంధువుల సాయం తోనో కాలక్షేపం చేస్తుంది తప్ప ఊరు దాటి రానంటుంది....

ఊరితో సంబంధాలు తగ్గి పోవడంతో... ఊరి వారితో అనుబంధాలు కూడా తెగి పోతున్నాయి... మా మావ గారిది కూడా దగ్గర్లోని ఊరే కావడంతో అప్పుడప్పుడూ మా ఆవిడ మాత్రం పిల్లల్ని తీసుకొని మా బావ మరుదుల ఇళ్ళకు, మా అమ్మ దగ్గరకు వెళ్ళి వస్తుంటుంది.. కాని, అమ్మ ఏనాడూ ఏమి ఉందో, ఏమి తిందో చెప్పదు... ఏమిచ్చినా తీసుకోదు... ఉన్న ఆరెకరాల పొలం మీద వచ్చే ఆదాయం కూడా అంతంత మాత్రమే .. ఎందుకంటే.. కౌలు వాళ్ళ దగ్గర ముక్కు పిండి వసూలు చేసే తత్వం కాదు అమ్మది.

నాన్న గారు పోయినా, అమ్మ మాత్రం ఆ ఊరు, ఇల్లు వదలడానికి సుతరామూ ఇష్ట పడక పోవడంతో ఆమెని ఎక్కువగా ఒత్తిడి చెయ్య లేక, ఆమెని ఒంటరిగా ఉంచడం ఇష్టం లేక సతమతమవుతుంటాను.. అమ్మ దగ్గర కొంత కాలం గడప లేక పోతున్నానన్న వేదన.. బిజీ లైఫుతో మరపుకు వస్తుంటుంది.

మరలా ఫోను రింగవటంతో.. ఆలోచనలను పక్కన పెట్టి, ఫోను అందుకున్నాను... అవతల లైనులో ఉన్నది- పద్మనాభం. మా ఊరి వాడు, నా క్లాసు మేటు - ఉన్నత విద్యా శాఖ మంత్రి.. ఉగాది శుభాకాంక్షలు చెప్పాడు. ఎంత బిజీగా ఉన్నా స్నేహితుని గుర్తుంచుకున్నందుకు చాలా సంతోషం అనిపించింది.. ఈ రోజు ఉగాది కార్యక్రమానికి తనే ముఖ్య అతిథి... అందుకని, సాయంత్రం తీరిగ్గా మాట్లాడుకుందాం.. అంటూ ఫోను సంభాషణ ముగించాడు. తను పి.జి. చేసి, మా దగ్గర ఊరిలోనే కొన్నాళ్ళు లెక్చరర్ గా చేశాడు. విద్యా రంగ సంస్కరణల కోసం ఉద్యమాలు చేసి, ఉపాధ్యాయ నియోజక వర్గం ఎమ్.ఎల్.సి. గా గెలిచేడు. రెండోసారి కూడా గెలవటంతో విద్యాశాఖ మంత్రి గానే అవకాశం దక్కింది. దాంతో...రాజకీయాల ఆకర్షణలో ఆదర్శాలకు తాత్కాలికంగానైనా విరామం ఇవ్వక తప్పలేదు. విద్యా రంగం అభివృద్ధి పట్ల శ్రద్ధ తగ్గి, కార్పొరేట్ కాలేజీల

ప్రయోజనాలకే కొమ్ము కాస్తున్నాడని ఆరోపణలు గుప్పుమంటున్నాయి.. ఈ మధ్యనే మామగారి ప్రోద్బలంతో వ్యాపారం లోకి అడుగు పెట్టాడని, బినామీ పేర్లతో ఇంజనీరింగ్ కాలేజీలలో వాటాలు పొందాడని అభియోగాలు వచ్చాయి..     పదవీ లాలస, ఎంతటి ఆదర్శవంతుడినైనా ఎలా మార్చేస్తుందో అనిపిస్తుంది తనని చూస్తే.

పండగ సందర్భంగానైనా.. సిటీలో ఉన్న మా ఊరి స్నేహితులకి ఫోను చేసి మాట్లాడాలనిపించింది... ముందుగా సుబ్బరాజుకి ఫోన్ చేసాను.. చాలా సంతోష పడ్డాడు.. 'ఎన్నాళ్ళయింది శర్మా! నీ గొంతు విని, నీకు ఇంటికి ఫోన్ చేస్తేనేమో బయట ఉన్నావంటారు.. మొబైల్ కి చేస్తే స్విచాఫ్ వస్తుంటుంది... కలవడానికి కూడా తీరికలేనంత బిజీ అయిపోయావ్... అవునులే.. సినిమా మనుషులు కదా.. రాత్రీ పగలూ బిజీ... సరే! మాకెప్పుడు కాంప్లిమెంట్లు ఇస్తావు? అంటూ గడ గడా మాట్లాడేసాడు... ఆప్యాయత, అనుబంధం తన మాటల్లో కల గలిపి. "ఈరోజు సాయంత్రం రవీంద్రభారతి లో కార్యక్రమం ఉంది కదా.. నేను, పద్మనాభం వస్తున్నాం.. నువ్వు కూడా అక్కడకు రా.. అని పిలిచాను. తప్పకుండా వస్తానన్నాడు.

సుబ్బరాజు, మా ఊరి పెద్ద సూర్యనారాయణ రాజు గారి అబ్బాయి.     వాళ్లది పెద్ద దివాణం. ఆడంబరాల మూలానయితేనేం, అయిన వాళ్ళ మోసాల వల్ల నయితేనేం.. ఆస్తులన్నీ కరిగి పోయి, ఆ దివాణం ఒక్కటీ మిగిలింది.     సుబ్బరాజు బాగా చదువుకుని, ప్రభుత్వోద్యోగం పొంది రెవిన్యూ డిపార్టుమెంటులో మంచి హోదాలో పని చేస్తున్నాడు . మొదట్లో సేవా భావంతో, పాప భీతితో ఉన్నా, క్రమంగా అవినీతికి, అక్రమార్జనకి అలవాటు పడ్డాడు. ఈ డిపార్టుమెంటులో పని చేయాలంటే మనం తినాలి... పైవాడికి పెట్టాలి... తప్పదురా! అంటాడు సమర్ధనగా.. దురలవాట్లకు కూడా లోనవుతున్నాడన్న విషయం తెలిసి వాళ్ళ తల్లి దండ్రులు మందలించారని.. ఈ మధ్యన ఊరు వెళ్ళడం కూడా మానేశాడు.. ఒకసారి ఎ.సి.బి. కి పట్టుబడ్డాడు.. మంత్రి గారికి కొంత ముట్టచెప్పి బయట పడ్డాడు. అయినా బుద్ధి మార లేదు.. ఆదాయం మీదున్న శ్రద్ధ పిల్లల మీద లేక పోవటంతో, వాడి కొడుకు, కూతురు కూడా చెడు అలవాట్లకు లోనై దారి తప్పుతున్నారని తెలిసింది... మిగతా విషయాలు ఎలాగున్నా, స్నేహితులంటే వాడికి ప్రాణం. అదే వాడిలో ఉన్న గొప్ప సుగుణం.

ఇక కుమార్ కి ఫోను చేయాలి అని అనుకుంటుంటే.. వాడి నుండే ఫోను వచ్చింది. పరస్పరం ఉగాది శుభాకాంక్షలు తెలుపుకొని, సాయంత్రం రవీంద్ర భారతిలో కలుసుకుందాం అనుకున్నాం. ఈరోజు కార్యక్రమం స్పాన్సరర్స్ లో వాడి సంస్థ కూడా ఉంది. కుమార్ వాళ్ళది మా ఊర్లో కిరాణా కొట్టు. మా చిన్నప్పుడు వాడిని కలిసే వంకతో వాళ్ళ కొట్టుకు వెళ్ళడం, అటుకులో, బెల్లమో తీసుకుని రావడం ఇంకా గుర్తే.. పైగా, వాళ్ళ నాన్నగారు శంకరం గారు మా రామాలయానికి ధర్మ కర్తగా ఉండి, వెండి దశావతార మూర్తులను తయారు చేయించారు. బి.కాం. చదివిన వెంటనే, కుమార్ హైదరాబాద్ వచ్చి చార్టర్డు అకౌంటెంటు కోర్సు పూర్తి చేసి పిల్లనిచ్చిన మామగారి సహకారంతో వ్యాపారంలో ప్రవేశించి అచిర కాలం లోనే అభివృద్ధి చెందాడు.     పిల్లలు, వ్యాపారాల బిజీలో పడి, దాదాపు తల్లి దండ్రుల గురించి పట్టించుకొనే తీరిక లేకుండా ఉన్నాడు.. ఊరు వెళ్ళితే ఖర్చయ్యే సమయం కూడా, వ్యాపారానికి వెచ్చిస్తే లక్షలు గడించ వచ్చనే స్థితికి చేరుకున్నాడు.

ఒకే ఊరికి చెందిన వాళ్ళం, క్లాస్ మేట్స్ నలుగురం ఒకే కార్యక్రమంలో కలుసుకోవడం కాకతాళీయమే అయినా - చాలా రోజుల తరవాత ప్రాణ స్నేహితులను కలుసుకుంటున్న సంతోషం - సాయంత్రం ఎప్పుడవుతుందా అని ఎదురు చూసేటట్లు చేసింది.

అనుకున్న సమయం రానే వచ్చింది. అధ్యక్షుల వారి పరిచయం, ముఖ్య అతిథి పద్మనాభం ఉపన్యాసం అయ్యాక- అసలు కార్యక్రమం 'ఉగాది- కవిసమ్మేళనం' ప్రారంభమైంది. అందులో ఈ సంవత్సరం తరపున ఉగాది పురస్కారాలు పొందిన యువకవులు కూడా కొందరు ఉన్నారు.

ఒక్కొక్కరూ తమ కవితల్ని చదివి వినిపిస్తున్నారు. కోయిలల్ని, మావి చిగురుల్ని మరచి పోలేని భావకవులు, పండగనేది పెత్తం దార్లకే గాని, పేద వారికి కాదనే అభ్యుదయ కవులు, ఉగాది పచ్చడి చేసేది స్త్రీలు, తినేది పురుషులు- ఇది అనాదిగా జరుగుతున్న అణచివేతకు సాక్ష్యం - అంటున్న స్త్రీ వాద కవయిత్రులు - ఇలా సాగి పోతుండగా, నా పేరు వినిపించింది.

నా పేరు ప్రకటించడంతోనే, అప్పటివరకూ చప్పగా ఉన్న హాలు, చప్పట్లతో చైతన్యవంతమైంది. కేవలం వచన కవిత్వం చదవకుండా, గేయ కవితను పాడటం నాకు అలవాటు. అంతే కాదు... నాటక రంగ, సినీ రంగ రచయితగా ఉన్న పేరు వల్ల కూడా కావచ్చు, ప్రేక్షకులు నన్ను కరతాళ ధ్వనులతో స్వాకతించారు. "నవ ఉగాదివా? నవతకు నీవు నాందివా? ఓ యుగాది, మానవతకు నువు పునాదివా? నా మదిలో ప్రశ్నలకే నువు జవాబువా? నీవె ప్రశ్నవా?..." అంటూ, సమ కాలీన జాడ్యాల మీద, సామాజిక రుగ్మతల మీద గేయ కవితాస్త్రాన్ని సంధించాను.

ఊహించిన దాని కన్నా ఎక్కువగా ప్రేక్షకులు తమ ఆనందాన్ని, అభిమానాన్ని మార్మోగే చప్పట్లతో తెలియ జేసారు. నేను కూర్చున్న రెండు నిముషలకు కూడా సద్దుమణగలేదు. అప్పుడు వ్యాఖ్యాత - "ఇప్పటి వరకు ప్రముఖ కవుల కవిత్వాన్ని విని ఆనందించారు. ఇప్పుడు నేటి ఉగాది పురస్కార గ్రహీత, యువ కవి, పల్లె వాసనల్ని పట్టి మనకందించే జానపద గాయకుడు రామా చారి తన గేయ కవిత్వం వినిపిస్తారు.." అంటూ ప్రకటించాడు.

సన్నగా, పొడుగ్గా, నామం పెట్టుకుని, లాల్చి వేసుకున్న ఒక కుర్రాడు లేచాడు. బహుశా ఇరవై, ఇరవై రెండు సంవత్సరాల వయసు ఉంటుందేమో... ఆసక్తిగా అతని కేసి చూసాను. ఆ యువకుడు "సభా సరస్వతికి నమస్కారం! మన తెలుగు తల్లికి, మా పల్లె తల్లికి, నా కన్న తల్లి దండ్రులకు సాష్టాంగ ప్రణామాలు అర్పిస్తున్నాను..." అంటూ సంస్కార వంతంగా చేసిన ఉపోద్ఘాతానికే హాలంతా చప్పట్లతో ప్రతిధ్వనించింది. అతను..."ఈ ఉగాది పండగ సందర్భంగా ఉగాది అంశంపై ఎందరో ప్రముఖ కవులు తమ అద్భుతమైన కవితల్ని వినిపించారు. నేను మాత్రం మా పల్లెకి నిజమైన ఉగాది రావాలని తపిస్తూ రాసుకున్న స్వీయ గేయాన్ని వినిపించ బోతున్నాను.." అన్నాడు. ఆసక్తి కరమైన అతని పలుకుల్ని సభ తన నిశ్శబ్దంతో ఆహ్వానించింది. మహామహులైన కవుల మధ్య ఈ యువకుడేం చెప్పబోతున్నాడా అనే ఆశ్చర్యం, ఆసక్తి కూడా వారి నిశ్శబ్దంలో వ్యక్తమయింది.

గొంతు సవరించుకున్న ఆ యువకుడు-

"ఏడాకెళ్ళావంటూ... ఏడుస్తున్నాదయ్యో...

నీ పల్లే తల్లీ - నీకోసం...

ఎప్పొడొస్తావంటూ... ఎదురూ చూస్తోందయ్యో...

నీ కన్నా తల్లీ- నీకోసం...

మా పల్లే పిల్లాగాడా.. పట్నామొచ్చినోడా...

ఒక్కాసారీ విను నా పాటా...

పట్టూరా నీ పల్లె బాటా...."

అంటూ తన గంభీర స్వరంతో గేయం ఆలపించేసరికి, సభా ప్రాంగణమంతా గంభీరత సంతరించుకొంది. పిల్లా, జెల్లా సందడి లేక బోసి పోయిన పంతులు గారి మండువా లోగిలి, పంక్తి భోజనాల ఊసే కరువై పోగా బావురు మంటున్న వంటింటి సావిడి, అతని తొలి చరణంలో వినపడగానే.. నాకు తెలియ కుండానే, నా శరీరం వణికింది, గుండె కలుక్కుమంది... పిలిచి అన్నం పెట్టే పెద్దమ్మ నేడు పట్టెడన్నం లేక పస్తులుంటున్న కరుణ రసాత్మకమైన దృశ్యం మనసును కలచి వేసింది...ఊరంతా పెద్దమ్మా, పెద్దమ్మా.. అంటూ పిలిచే అమ్మ కళ్ళ ముందు మెదిలింది. నా ప్రమేయం లేకుండానే కళ్ళు వర్షిస్తున్నాయి. వాటిని తుడుచు కొనే ప్రయత్నం చేయాలనిపించ లేదు.

ఆ యువకవి తన గేయం రెండో చరణంలో...మనుషులు మసలక, బూజు పట్టిన రాజుల దివాణం, చూసే దిక్కు లేక, సాకే మనుషులు రాక, ఘోషాలు పోయి, గోవులు పోయి, గిద్దెడు పాల కోసం కూడా దిక్కులు చూస్తున్న ముసలి తల్లిని వర్ణిస్తుంటే, నా ఎదురుగా ప్రేక్షకులలో ముందు వరుసలో కూర్చున్న సుబ్బరాజు ముఖం వివర్ణమవడం, అసంకల్పితం గానే, అతని చేయి కన్నీళ్ళు తుడవడం కన్పించింది.

మూడో చరణంలో ఆ యువకుడు, పండగ నాడు కూడా సందడి కనిపించని షావుకారు ఇంటిని, ఊరగాయ, చారుతో గడుపుతున్న దైన్యాన్ని, కొట్టు మూసేసి, ఊరిలో ఉల్లి పాయల బండి నడుపుతున్న వాస్తవాన్ని, దాన, ధర్మాలతో చితికి పోయి, దారీ తెన్నూ లేక, దీనావస్థలో ఉన్న చిత్రాన్ని కళ్ళకు కట్టేటప్పటికి, కార్యక్రమానికి పోషకుడిగా వ్యవహరిస్తూ అందరి అభినందనల్ని అందుకుంటున్న కుమార్ కి గుండె బరువెక్కిన దృశ్యం స్పష్టంగా కనబడుతోంది. ధారా పాతంగా కారుతున్న కన్నీళ్లు కోటును తడిపేస్తున్నాయి.

రైతన్నల ఇంట్లో కరువై పోయిన ధాన్యం, పల్లెల్లో బరువై పోయిన సేద్యం, చిన్న బోతున్న చేతి వృత్తులు, కూడు పెట్టని కుల వృత్తులు, పచ్చని చేలల్లో వెలుస్తున్న సెజ్జులు, పల్లె గుండెల్లో పెడుతున్న చిచ్చులు, కూలీలవుతున్న రైతులు, కూలి దొరకక వలస పోతున్న బతుకులు .... ఇలా వల్లకాడవుతున్న పల్లె వైనాన్ని, ఛిద్రమై పోతున్న పల్లె సంస్కృతిని గుండెలు పిండేలా.. ఆ యువకవి తన గేయంలో సాక్షాత్కరింప జేస్తుంటే, మంత్రిగా ఉన్న మా పురుషోత్తం మౌనంగా విలపిస్తుండటం నాకు స్పష్టంగా కనబడుతోంది.

ఏటికో సారైనా ఊరు రారేమంటూ, కాటికి పోయే కన్నోళ్ళను కనరేమంటూ ప్రశ్నిస్తూనే... అభిమానమడ్డొచ్చి మీ పెద్దోళ్ళు మీకు అసలు విషయాలేమీ చెప్పటం లేదంటూ... వాస్తవాన్ని విశదీకరిస్తున్న అతని పాట అక్కడున్న ప్రేక్షకుల గుండెల్లో బల్లెపు పోటుగా మారింది., భాగ్య నగరంలో దొరికే బంగారం కన్నా, అమెరికా దేశంలో పండే డాలర్ల కన్నా విలువైన ప్రేమాభిమానాలు పల్లె తల్లి పంచే బహుమానాలని- అతను ఎత్తి చూపుతుంటే, అతని ముఖం లోకి సూటిగా చూసే ధైర్యం ఎవరికీ లేదని, వాలుతున్న కళ్ళూ, రాలుతున్న కన్నీళ్ళూ చెపుతున్నాయి.

"పల్లే దేశానికి పట్టు కొమ్మన్న నేతల మాటలు నీటి మూటలయ్యాయని, రైతు రాజయ్యే రోజొస్తుందని ఎదురు చూసి చూసి, కళ్ళూ కాయలు కాసాయని, తల్లి దండ్రులంటే దైవ స్వరూపులనే పెద్దల మాటలు పెడ చెవిన పడ్డాయని..." అతను నిష్ఠూరంగా పాడుతుంటే.. నిలువెల్లా గాయాలైన పల్లె తల్లీ, గుండెల్లో మౌనంగా బాధలు నింపుకున్న తండ్రీ, తల్లీ ప్రతి ఒక్కరి ముందూ ప్రత్యక్షమవుతుంటే... ఒకరికి తెలియకుండానే ఒకరు మౌనంగా రోదిస్తున్నారు...

"నిచ్చెనల్లే పల్లేనెక్కి ఎదిగినోడా....

సచ్చిపోతన్నానూ... సూడంగా రావేరా....

మా పల్లే పిల్లాగాడా.. పట్నామొచ్చినోడా...

ఒక్కాసారీ విను నా పాటా...

పట్టూరా నీ పల్లె బాటా...."

అంటూ పాడుతున్న ఆ యువకుడి గొంతు దు:ఖంతో జీర బోవడం, సభ మొత్తం ఘొల్లుమనడం ఒకే సారి జరిగింది.

ఆగకుండా వినిపిస్తున్న కరతాళ ధ్వనులు, ఆపకుండా కారుస్తున్న కన్నీటి జడులు, ఆ యువకునికి అభినందనలు తెలియజేస్తోంటే... భేషజాలన్నీ వదిలి, ఆ కుర్రాణ్ణి ఆలింగనం చేసుకున్నాను. మంత్రినన్న మాట మరచిన పురుషోత్తం, కుమార్, అప్పుడే వేదిక మీదికి వచ్చిన సుబ్బరాజు, నన్ను అనుసరించారు.

ఉద్విగ్న భరిత వాతావరణం నుంచి సభికులు తేరుకోడానికి చాలా సమయమే పట్టింది. ప్రేక్షకుల కరతాళ ధ్వనుల మధ్య... " ఈ యువకుడు రామాచారి, సంస్కృతాంధ్ర భాషలలో ప్రావీణ్యుడు. యూనివర్సిటీ గోల్డ్ మెడలిస్ట్... అయినా, తన పాటలతో సామాన్యులలో చైతన్యం తేవాలని, పల్లె తల్లి సేవలో పునీతం కావాలని, అతని స్వగ్రామం .. శ్రీరామ పురానికే అంకితమవుతున్న నిజమైన అభ్యుదయ వాది....అంతే కాదు, తనకు పురస్కారంగా లభించిన ఏభై వేల రూపాయలను తన ఊరిలో రామాలయ పునర్నిర్మాణానికి వినియోగిస్తున్న ఆదర్శ వాది... " అంటూ.. వ్యాఖ్యాత గొంతు వినిపిస్తుంటే, మేం నలుగురం ఆశ్చర్యపోయాం... సంతోషం, సందేహం కలగలిపి ఉక్కిరి బిక్కిరి చేస్తోంటే, ఆ కుర్రాడిని అడిగాను..." బాబూ! నీ ది ఏ శ్రీరామపురం?" అని. "కోనసీమ లోదండి... అమలాపురం దగ్గర.." అన్నాడు అతను. అంటే, మా ఊరే... మరింత ఆశ్చర్యంతో అడిగా... "ఎవరబ్బాయివి?" అని. "రామాలయం అర్చకులు శేషాచార్యులు గారి అబ్బాయినండీ...." అన్నాడు. అంతే... "మా కళ్ళు తెరిపించావయ్యా...చిన్న వాడివయినా, పల్లెని, తల్లిని మా కళ్ళముందుంచావు, మా కర్తవ్యం గుర్తు చేసావు..." అంటూ నలుగురం, ఆ అబ్బాయిని మరో సారి హత్తుకున్నాం.

ఆ రాత్రికి మా ఇంట్లోనే అతనికి భోజనం ఏర్పాటు చేసాను. నా స్నేహితులు ముగ్గురిని కూడా సకుటుంబంగా ఆహ్వానించాను. ఛిద్రమైన మా పల్లె, మరింత శిథిలమై పోకూడదని నలుగురం నిర్ణయం తీసుకున్నాం. మర్నాడే, పురుషోత్తం, మా గ్రామంలో పాఠశాల, కళాశాలల అభివృద్ధికి అక్కడే మకాంవేసి, కృషిచేయడానికి ఊరికి బయల్దేరాడు. నేను అమ్మకు ఫోన్ చేసి, ఊరు వస్తున్నానని చెప్పాను... సకుటుంబంగా, శాశ్వతంగా అక్కడే ఉండటానికి.

సుబ్బరాజు స్వచ్ఛంద పదవీ విరమణకి అప్లయ్ చేస్తానన్నాడు... ఊరిలో దివాణానికి పూర్వవైభవం తేవడానికి, ఆ దివాణంలో ఉచిత వైద్యశాల ఏర్పాటు చేయడానికి. గుప్తా వ్యాపారాల ఆకాశం నుంచి, వాస్తవ ప్రపంచంలోకి వచ్చాడు, గ్రామంలో స్థానికి వనరులను వినియోగిస్తూ, ఉపాధి కలిగించే విధంగా పరిశ్రమల స్థాపనకు ప్రణాళిక సిద్ధం చేసాడు.

శ్రీరామనవమికి వారం రోజుల ముందే అందరం కుటుంబాలతో సహా గ్రామానికి చేరుకున్నాం. సీతారాముల కళ్యాణానికి దగ్గరుండి అన్ని ఏర్పాట్లూ చేసాం. ఆ ఊరినుంచి ఇతర ప్రాంతాలకు వెళ్ళిన వారందరికీ ఫోన్లు ద్వారా కళ్యాణానికి రావాలని ఆహ్వానించాం... సీతారాముల కళ్యాణానికి ఊరంతా తరలి వచ్చింది.. సహపంక్తి భోజనాలతో సోదర భావం మరలా వెల్లి విరిసింది... మా పల్లె మురిసింది.

పాడుపడి, శిథిలమైపోతున్న రామాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. అది మా గ్రామ పున:ప్రతిష్ఠకు కూడా శంకుస్థాపనే... ఊర్లో ఉండగా.. నాటక సమాజాన్ని నడిపే సుబ్రహ్మణ్యం ఫోన్ చేసాడు... "శర్మ గారూ! ఎంత ట్రై చేసినా, మీ ఫోన్ దొరకట్లేదు..ఎక్కడున్నారు? నంది నాటకోత్సవాల పోటీకి మీరు మాకు ఒక కొత్త నాటకం రాసిపెట్టాలి..." అన్నాడు. "తప్పకుండా... టైటిల్ ఇప్పుడే చెప్పేస్తున్నాను..."పున:ప్రతిష్ఠ"... రాయటం పూర్తయ్యాక నేనే మీకు ఫోన్ చేస్తాను" అంటూ ఇంట్లోకి నడిచాను, మూలపడిన నాన్నగారి రాతబల్ల శుభ్రం చేయడానికి.




ఎనిమిదవ తరగతి చదివే రమణకి అల్లరి ఎక్కువ. సుబ్బరాజు సావిత్రమ్మల ఏకైక సంతానం కావడంతో ముద్దు ఎక్కువై అలా తయారయ్యాడు. కొడుకుని మంచి మార్గంలో పెట్టేందుకు ప్రయత్నించేవాడు సుబ్బరాజు. రమణకి ఒత్తాసు పలకాలని సావిత్రమ్మ చూసేటప్పుడు ఆమె మీద విరుచుకు పడేవాడు సుబ్బరాజు. అవసరమైతే రమణకి నాలుగు దెబ్బలు తగిలించేవాడు.అప్పటినుండి తండ్రి అంటే భయం పెరిగింది రమణకి .

ఆ రోజు ఉగాది పండుగ కావడంతో సావిత్రమ్మ వేకువనే నిద్ర లేచి పనులు ప్రారంభించింది. ఉగాది పచ్చడి తయారు చేసింది. దేవుడికి నైవేద్యంగా పెట్టి పూలు, పండ్లతో పూజలు జరిపింది.

రమణని పిలిచి “నువ్వు తలస్నానం చేసి కొత్త బట్టలు వేసుకుని దేవుడిని ప్రార్థించు. పరీక్షల్లో మంచి మార్కులు రావాలని కోరుకో. ఈ రోజు జరిగేదే సంవత్సరమంతా జరుగుతుందని అంటారు. నాన్న దగ్గర బుద్ధిగా ఉండు” అంది సావిత్రమ్మ. అలాగే అని చెప్పిన రమణ గబగబా పనులు పూర్తి చేసాడు.

“ఇవాళ జీడిపప్పు, కిస్మిస్ ఎక్కువ వేసి పాయసం చేస్తాను. ప్రక్క వీధి పాల దుకాణంలో రెండు పాల పేకెట్లు తీసుకురా!” అని వందనోటు ఇచ్చింది సావిత్రమ్మ. అది జేబులో పెట్టుకుని పరుగు లాంటి నడకతో వీధిలోకి వెళ్ళాడు రమణ.

అలా వెళ్ళిన రమణ మరో మూడు గంటలు గడిచినా రాలేదు. ఇంట్లో ఉన్న సావిత్రమ్మ, సుబ్బరాజులకు కొడుకు ఏమయ్యాడా అని కంగారుగా ఉంది. "వెధవ ఇంట్లోకి రాగానే కాళ్ళు విరగ్గొడతాను. తిరిగి రావడానికి ఇంత ఆలస్యమా?" అని కోపంగా మాట్లాడాడు సుబ్బరాజు.

"పండుగతో వాడిని ఏమి తిట్టవద్దు. వాడు వచ్చాక అడుగుదాము" అంటోంది సావిత్రమ్మ. సరిగ్గా అప్పుడే ఇంటికి వచ్చాడు రమణ. వాళ్ళ మాటలు విన్నాడు. రమణ చేతిలో పాల పేకెట్లు లేవు.

"ఏరా ఇంతసేపయిందేం? పాల పేకెట్లు ఏవిరా?" అని అడిగాడు సుబ్బరాజు రమణని చూసి. భయంతో మాట్లాడలేదు రమణ. తండ్రి ఏమి చేస్తాడో అన్న భయంలో ఉన్నాడు. బేల చూపులు చూస్తున్నాడు తప్ప మాట్లాడక పోవడంతో "ఎవరైనా అడ్డగించి డబ్బు లాక్కుని వెళ్ళిపోయారా? అందుకే ఆలస్యం అయిందా?" అని అడిగింది సావిత్రమ్మ.

కాదన్నట్టు తలూపాడు రమణ. "మరేం జరిగింది" హుంకరించి అడిగాడు సుబ్బరాజు.

'మీరు కాసేపు లోపలకి వెళితే నేను కనుక్కుంటాను" అని భర్తని లోపలకు పంపింది సావిత్రమ్మ. తండ్రి వెళ్లిపోవడంతో రమణ నోరు విప్పాడు.

'పాల పేకెట్ల కోసం వెళుతుండగా కొందరు జనం రోడ్డు మీద వేపచెట్టు కింద ఉండగా చూసాను. వేపపువ్వు కోసం చెట్టెక్కి కింద పడ్డాడు సింహాచలం. వాడు నా తరగతే. వాడికి ఎవరూ సాయం చేయలేదు. వాడికి తగిలిన దెబ్బల నుండి రక్తం కారుతోంది. పాపం వాడికి నాన్న లేడు. అమ్మ పాచి పనులు చేస్తుంది" అని చెప్పాడు రమణ.

"నీకెలా తెలుసు?" అని మధ్యలో అడిగింది సావిత్రమ్మ.

"వాడే చెప్పాడు. ఉగాది రోజు ఉదయం వేపపువ్వు, మామిడి కాయలు అమ్ముతానని , ఆ డబ్బుతో నిక్కరు, చొక్కా కొనుక్కుంటానని కూడా చెప్పాడు. వాడిని అలా చూడగానే జాలి కలిగింది. నువ్విచ్చిన వంద రూపాయలతో ఆసుపత్రికి తీసుకువెళ్ళి వైద్యం చేయించాను. వాళ్ళ అమ్మ వచ్చేవరకు వాడి ప్రక్కన ఉన్నాను. అంతకు ముందే వాడి సంచిలో ఉన్న మామిడి కాయలు, వేపపువ్వు చూసాను. వాడికి ఉన్న కోరిక తీర్చాలని అనుకుని వేపపువ్వు, మామిడి కాయలు ఒక దుకాణం వాడికి అమ్మాను. వచ్చిన డబ్బు సింహాచలంకి ఇచ్చాను. ఆ డబ్బు చూసి అంత బాధలోనూ వాడు ఎంతో సంబర పడ్డాడు.

అందుకే ఆలస్యం అయింది. నేను చేసింది తప్పా?" అని అడిగాడు రమణ తల దించుకుని.

"ఇది విన్నారా? రమణ ఎంత మంచి పని చేసాడో" అని భర్తని పిలిచింది సావిత్రమ్మ. గదిలో నుండి బయటకు వచ్చిన సుబ్బరాజు "అంతా విన్నాను. డబ్బు వృధా అయితే చివాట్లు పెడతానన్న భయం లేకుండా సింహాచలంకి వైద్యం చేయించి మంచి పని చేసాడు. మానవత్వం తెలియని వాళ్ళకి కళ్ళు తెరిపించాడు. వంటలు వండుకుని తింటే పండుగ కాదనీ, సాటి మనుషుల కళ్ళలో వెలుగు నింపడం పండుగ అని కొత్త అర్ధం చెప్పాడు. అందరు పిల్లలు ఇలాగే మంచిగా ప్రవర్తించడం నేర్చుకుంటే ఎంతో బాగుంటుంది" అని కొడుకుని గుండెలకు హత్తుకున్నాడు సుబ్బరాజు.

తండ్రి ముఖంలో తన్మయత్వం చూసి గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు రమణ.




అమ్మా మీ సందేహం ఏమిటో మా గురువు గారి దగ్గర విన్నవించుకోండి " అంటూ నారాయణ అసిస్టెంట్ సుందరం ఆ రోజు అక్కడికి వచ్చిన వారి హాజరు పట్టీ లోంచి ముందు వరసలో కూర్చుని ఉన్న ఆండాళ్ళమ్మ గారనే ఆవిడను లోపల గదిలోకి వెళ్ళమని పిలిచాడు.ఆమె ముక్కు పుటాలు అదురుతున్నాయి. వెన్నులో సన్నటి జలదరింపు ప్రారంభమయ్యి మొహం చెమటతో ముద్దయ్యింది. ఆ వెంటనే ముఖం

అరుణ వర్ణం దాల్చింది.

“పది సంవత్సరాల నుండి కథలు వ్రాస్తున్నాను. ఇప్పటివరకు ఒక్క కథ కూడా ప్రచురణకు నోచుకోలేదు. నా జీవిత కాలంలో నా పేరు అచ్చులో చూసుకోవడం జరిగే పనేనా అని సందేహం నన్ను చంపుకు తింటోంది “ “ అంది ఆమె విచారాన్నంతా ముఖానికి పులుముకుని. “అదేమిటమ్మా ప్రింటులో ఒక్కసారి కూడా మీ పేరు చూసుకోలేదా ? మీ పెళ్లి శుభలేఖలో ఆ భాగ్యం మీకు కలిగి ఉండాలే ? అన్నాడు నారాయణ విలక్షణమైన నవ్వు నవ్వుతూ.“ ఏదో లెండి శాస్త్రం చెప్పినట్టు నాకంత భాగ్యం కూడాను.

మా ఇంట్లో వాళ్ళ కిష్టం లేని పెళ్లి ఎవరితోనో ముక్కూ మొహం తెలియని వ్యక్తితో చేసుకున్నాని ఇంట్లో అందరూ ప్రతిఘటించడంతో మొహం చెల్లక శుభలేఖలు కూడా అచ్చు వేయించుకోలేదు. ” అంటూ తన్నుకు వస్తున్న ఏడుపును బలవంతంగా ఆపుకుంటూ చెప్పింది ఆండాళ్ళమ్మ ఘోరమైన పొరపాటే ధో తన జీవితంలో జరిగిపోయిందన్నట్టుగా మొహం పెట్టి.“ అయ్యో అలా విచారించకండమ్మా ఇప్పుడేం కొంప మునిగి పోయింది ? రచనలకు ఒక సామాజిక ప్రయోజనం ఉండాలి. ఏదో రాసామంటే రాసాం అన్నట్లుగా ఉంటే అవి కాలక్షేపానికి పనికొస్తాయేమో తప్ప సమాజానికి ఒక దశా దిశా నిర్దేశించ లేవు. అయినా మీకు కథలు వ్రాయాలనే ఆసక్తి బాగా కనపడుతోంది కాబట్టి మీ సమస్యను పరిష్కారం చెయ్యడానికి ప్రయత్నం చేస్తాను.

కథలు పత్రికలలో రావడమే పరమావధి కాదు. డబ్బు పెట్టి ఎంతమంది తాము వ్రాసిన వాటిని అచ్చు వేయించుకోవడం లేదూ ? ఏదీ మీ అముద్రితాలు ఒకసారి చూపించండి మీ కథలు ఎందుకు వెలుగులోకి రావడం లేదో చెప్పేస్తాను “ అన్నాడు నారాయణ.నారాయణ కొండంత భరోసా ఇవ్వడంతో ఆండాళ్ళమ్మ గుండెలు తేలిక పడ్డట్టయి హాయిగా ఊపిరి తీసుకుంది.

కొద్ది క్షణాల తర్వాత వణుకుతున్న చేతులలో పెద్ద దొంతర లోంచి ఒక కథను బయటకు తీసి నారాయణకు ఇచ్చింది. ఆమె పరిస్తితి చిలక జోతిష్యం చెప్పేవాడి దగ్గర ఏమిచెపుతాడో అని ఎదురుచూసే వాడిలా ఉంది.. అతను ఆమె ముఖం వైపు ఒక్కసారి పరిశీలనగా చూసి ఆ కథను అటూ ఇటూ తిప్పి వేదాంతిలా సన్నటి నవ్వు నవ్వాడు. ఆ వెంటనే ఒక నిట్టూర్పు విడిచి కొద్దిసేపు రెండు కళ్ళ మీద అరిచెయ్యి ఆనించి దీర్ఘంగా శ్వాస విడిచి తనలో తను నవ్వుకుంటూ ఆమె చేతిలోంచి చనువుగా ఇంకో కథను కూడా తీసుకుని పైన్నుండి కిందకు ఒకసారి చూసి “ అర్ధమైందమ్మా మీ కథలు ఎందుకు తిరిగి వస్తున్నాయో. ముఖ్యంగా మీరు కామాలు, ఫుల్ స్టాప్ లు , ప్రశ్నార్ధకాలు చూసుకోవడంలేదు.

కథ మొదలు పెట్టినప్పుడు 'నేను " అంటూ ఏక వచన ప్రయోగం చేస్తూ పది లైన్ ల తర్వాత ఆ పాత్రకు పేరు తగిలిస్తున్నారు.. కొన్ని లైన్లు పెద్ద పెద్ద అక్షరాలూ, ఇంకొన్ని చీమల్లా భూతద్దంతో చూసినా అర్ధం కాని విధంగా మీ దస్తూరి అయోమయంలో పడేస్తోంది.. ఇలాంటి రక రకాల విన్యాసాలతో ఎడిటర్లను గందర గోళంలోకి నెట్టేస్తూ వస్తున్నారు.. ఇక పోతే కథ వ్రాయాలనే ఆవేశం తప్ప ఎలా ముగించాలో తెలియని ఇబ్బంది కర పరిస్తితిని మీరు ఎదురుకుంటున్నట్టు కనిపిస్తోంది. అయినా ఇబ్బంది పడవలసిన పని లేదు. మీ సమస్యలన్నిటికీ సమాధానాలు నేను స్వయంగా రచించిన "వర్ధమాన రచియతలూ - సలహాలు " పుస్తకంలో లభిస్తాయి. దీని ధర, తర్వాత నా ఫీజు బయట మా కౌంటర్ లో కట్టేయండి. మీకంతా శుభం కలగాలని ఆశిస్తున్నాను " .... అంటూ నారాయణ చెప్పుతుండగానే ఆయన కాళ్ళకు నమస్కారం చేసి వాళ్ళంతా సంతోషంతో పులకించి పోతూ బయటకు వచ్చింది భవిష్యత్తులో పెద్ద రచయిత్రి కాబోతున్నానన్న ఆనందంతో. .లోపల నారాయణ ఆ వచ్చిన బాధితులకు ఏమి చెపుతున్నాడో బయట కూర్చున్న వారికి అర్ధమయ్యే అవకాశం లేదు. అయినా వాళ్ళంతా చెవులు రిక్కరించుకుని వినటానికి ప్రయత్నం చేస్తున్నారు.

ఈ లోపు నారాయణ అసిస్టంట్ సుందరం గోడనానుకుని దీర్ఘంగా ఆలోచిస్తూ ఉండిపోయిన ఒక వ్యక్తిని కదిపి " అయ్యా మీ సమస్య ఏమిటో గురువు గారికి చెప్పి తగిన సలహాలు తీసుకోండి " అన్నాడు హాజరు పట్టీలో టిక్ చేసుకుంటూ. "ఏమీ లేదు గురువు గారూ, నేనిప్పటికీ సుమారు అరవై డబ్బై కథలు వ్రాసుంటాను. నా ఖర్మ కాకపోతే ఒక్క కధంటే ఒక్కటి పడితే వొట్టు. రానూ రానూ ఈ ఎడిటర్ల మీద నమ్మకం పోతోందనుకోండి . వాళ్ళ కెలాంటి కథలు కావాలో ఏమేమి రికమండేషన్లు కావాలో అర్ధం అయ్యి చావడం లేదు " అన్నాడు ఆ వ్యక్తి విముఖతతో కూడిన బోల్డంత వైరాగ్యం కనపరుస్తూ."అయ్యా ముందుగా అరవై, డబ్బై అముద్రితాలకు కర్త, భర్త అయిన మీకు నా అభినందనలు. మీ ఆత్మ విశ్వాసానికి నా జోహార్లు.. అయితే మీ వోపికకు, మొక్కోవోని మీ అకుంటిత దీక్షకు ఏ ఎడిటరైనా కరుణించి మీకు వాళ్ళ పత్రికల్లో స్తానం కలిపించక పోవడానికి గల కారణం ఎప్పుడైనా వెతికారా ? ఎంత మటుకు ఎడిటర్ల మీద తోసెయ్యడమేనా? కనీసం మీ రచనలు మీ బంధువులకు గాని, మీ స్నేహితులకు గాని చూపించారా ? అసలు మీరు వ్రాస్తున్న కథలు కనీసం మీకు నచ్చుతున్నాయా ? కొన్ని రచనలకు శాశ్వత విలువలు వుంటాయి.

మీరు వన్ వే ట్రాఫిక్ లాగా రాసుకుంటూ మీ ఫీలింగ్స్ ను ఎదుటివారి మీద రుద్దాలనే ప్రయత్నం చేసారే తప్ప ఇంత పెద్ద సంఖ్యలో కథలు తిరిగి రావడానికి కారణం మీరెప్పుడూ ఆలోచించినట్టు లేదు. మీ కథల్లో తలా, తోకా లేకుండా కేవలం మీ అభిప్రాయాలకే విలువనిచ్చుకుంటూ ఏ మాత్రం హేతుబద్దత లేకుండా వ్రాసుకు పోతున్నట్టు కనిపిస్తోంది. కథలు మారుతున్న విలువలక్లు అద్దం పట్టేలా ఉండాలి. బాషలో, శైలిలో, శిల్పంలో కొత్తదనానికి ప్రాధాన్యత నివ్వాలి. ముందు ఇతరుల కథలు బాగా చదవండి. కొత్త కొత్త విషయాలు తెలుసుకోండి. అవన్నీ ఒక పాత డైరీలో వ్రాసుకోండి. ఏదో మిడిమిడి జ్ఞానంతో వ్రాసే కథలు ఏ పత్రిక వాళ్ళను కదిలించవు. అయినా కూడా మీరు విచారించాల్సిన పనిలేదు. కథలు వ్రాయడానికి కావలసిన కనీస సూత్రాలు అనే ఈ పుస్తకం పొందు పరచి వున్నాయి. ఇందులోని విషయాలను అనుసరిస్తే మీ కథలు ఒక్కొక్కటొక్కటి గా పత్రికల వారిని ఆకర్షించి అవి

వెలుగులోకి రావడానికి మార్గం సుగమం అవుతుంది. దీని ధర కేవలం ఒక్క వంద రూపాయలే అయినా దీనికి కొన్ని వందల రెట్లు ప్రయోజనం మీకు కలుగుతుందని నేను గంటాపధంగా చెప్పగలను." అంటూ తను వ్రాసిన పుస్తకాన్ని అతని చేతిలో పెట్టాడు. .

నారాయణ చెప్తున్నంత సేపు అతను ఉలుకూ పలుకూ లేకుండా కొయ్యబారి పోయాడు. నారాయణ మాటలు అతన్ని నిరాశ పరిచినా తర్వాత కథలు రాయడానికి కావలసిన ఎన్నో విషయాలు చెప్పాక అప్పటివరకు అతనిలో ఆవరించిన నిరాశ, నిస్పృహలు చేత్తో తీసేసి నట్లుగా అనిపించి నారాయణకు కృతజ్ఞతలు చెప్పుకుని బయట కౌంటర్లో పుస్తకం ధర, నారాయణ ఫీజు కట్టి బయట పడ్డాడు... సుందరం అక్కడే ఒక మూలకు గోడకు ఆనుకుని కూర్చుని నిలువెల్లా విచార వదనంతో ఉన్న ఒకావిడను ఆవిడ నెంబర్ ప్రకారం లోపలికి పిలిచాడు . ఆమె పెదవులు భూకంపం వచ్చినట్టు వణికి పోతున్నాయి. నోట్లో మాట బయటకు రావడం లేదు. కొద్దిసేపు తర్వాత ఎలాగో తమాయించుకుని గొంతు సవరించుకుని ఒక రకంగా నేనూ వాళ్ళ బాపతే. నేనే కథ రాసినా అవి అంతకు ముందే ఎవరో రాసేసినవని తెలిసి నిరాశకు గురవుతున్నాను. ఇలా ఎందుకు జరుగుతోందంటారు ?" అంటూ అమాయకంగా అడిగింది."అర్ధమైనదమ్మా మీరెక్కడో చదివిన కథలే మీ మనస్సు నిండా నింపుకుని అవే తిరగ వ్రాస్తున్నారని నా కనిపిస్తోంది.

మంచి అవగాహనాశక్తి, ఊహా శక్తి, ఏదైనా విషయాన్ని కూలంకషంగా, విమర్శనాత్మకంగా పరిశీలించడం, వీలైతే నలుగురితో చర్చించడం లాంటివి కథలు వ్రాసే వాళ్లకు బాగా ఉపయోగ పడతాయి. కాస్తంత వాస్తవానికి కొంత వూహ జోడైతే అది సహజ సిద్ధంగా ఉంటుంది. ఎన్నో అద్భుతమైన విషయాలకు, విజయాలకు ఆలోచనలే ముఖ్యం. రచయితకూ పాఠకుడికి మధ్య మంచి అవగాహన ఉండాలంటే మనం వ్రాసేది వాళ్ళలో చైతన్యం కలిగించేదిలా ఉండాలి. ఈ రోజు ఇక్కడికొచ్చిన వారందరికీ ఒక సలహా ఇవ్వదల్చుకున్నాను. దొరికిన అవకాశాన్ని సద్వినియోగ పరుచుకునే వాడే తెలివైన వాడు. మన ఇంట్లో ఒక కూర కాని, పులుసు కాని, పచ్చడి కాని ఏ మాత్రం రుచిగా కుదరక నోట్లో పెట్టుకోవడానికి వీలు కానప్పుడు వాటినెలా రిపేర్ చేసి అంటే కొన్ని అదనపు దినుసులు చేర్చి రుచికరంగా ఎలా మార్చుకుంటున్నామో తిరిగి వస్తున్న కథలను కూడా వాటిలో లోపించిన విషయాలను భర్తీ చెయ్యడం ద్వారా తిరిగి వాటిని ఆమోద యోగ్యంగా చేసుకో గలగడం ఒక కళ. ఇందుకు ప్రయత్నం చేసి సఫలీ కృతులు కండి " అంటూ ఆ రోజుకు ముగించాడు నారాయణ.

ఇంతకీ ఈ నారాయణ ఎవరు ? ఇతనెందుకు కధకులకు సలహాలు ఇస్తున్నాడు ? వాళ్ళందరూ ఇతగాడిని ఎందుకు ఆశ్రయిస్తున్నారు ?" అనే అనుమానం అందరినీ వేధించుకు తిన్తోందా ? ఏమీ లేదండి. నారాయణ పూర్వాశ్రమంలో ఒక మాంచి రచియత కాకపోయినా మామూలు రచయిత. రానూ రానూ కాల్పానిక కథకులకు, ఇంగ్లీష్ నావల్స్ నుండి వస్తున్న కాపీ కథలకు ఇతర భాషలనుండి వస్తున్న అనువాద కథలకు పత్రికా ప్రపంచంలో పెద్ద పీట వేస్తూండే సరికి నారాయణ కథలకు గ్రహణం పట్టి పాఠకులకు పూర్తిగా దూరం కావాల్సి వచ్చింది. సరిగ్గా అప్పుడే అతనిలో ఆలోచన మెదిలింది. . తనకున్న పరిమిత జ్ఞానంతో తనూ కొన్ని గుర్తింపు ఉన్న కథలు వ్రాసి ఉండటంతో ఆ అనుభవాన్ని పురస్కరించుకుని

తమ రచనలు వెలుగులోకి రాకపోవడానికి గల కారణమేమిటో తెలియక సతమతమవుతూ నిరుత్సాహంతో , నిర్వేదంతో , నిస్పృహతో కాలక్షేపం చేస్తున్న రచయితలు కాని రచయితలకు అంత వరకు ఎవరకూ స్పురించని ఎవరికీ తట్టని ఒక మార్గాన్ని సూచించే దిశగా ఒక వర్క్స్ షాప్ పెట్టి ఊహించని విధంగా వందల సంఖ్యలో రచనా బాధితులకు ఒక ప్లాట్ ఫారం ఏర్పాటు చేసి విజయవంతంగా దూసుకు పోతున్నాడు మాజీ రచయిత నారాయణ




" తాతగారూ! ఈ రోజు మా స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. మేమంతా మా క్లాస్ టీచర్లకు పండ్లు, పూలు ఇచ్చి నమస్కరించాం , తెల్సా?. "అంటూ గర్వంగా చెప్పింది సింధు.

" ఓహో అలాగా ! మరి అది ఎందుకు జరిపారో మీకు తెల్సా?" నవ్వుతూ అడిగారు తాత .

" మరి మాకు రోజా పాఠాలు, గణితం అన్నీ చెప్తారుగా ? అందుకోసమే !" అంది సింధు

" కాదు – కాదు- తాతా! దీనికేమీ తెలీదు. ఫ్రెండ్ షిప్ డే, ప్రేమికుల రోజు, మొన్న జరిగిన వాటర్ పొదుపు దినం, లాఫింగ్డే,

వృద్ధుల దినోత్సవం -- ఇలా చాలా జరుపు కున్నట్లే ఉపాధ్యాయుల రోజూ జరుపుకుంటాం." ధీమాగా అన్నాడు అరుణ్. "నీకు మహా తెల్సులేవోయ్! ఎంచక్కా నేనూ టీచర్లవుతా! అంతా నాకు పూలూ అవీ తెచ్చిస్తారు." అంది చిట్టి. ఇంతలో పక్కింటి పవన్, నయన్ ఇంకా కొందరు పిల్ల లూ వచ్చారు. అంతా కల్సి తాత గారి వద్ద కూర్చుని కధలు చెప్పించుకుని , ఆట లాడుకుంటారు ప్రతిరోజూ. సింధు మాటలు విని

" ఏంటీ ! టీచర్ వవుతావా? ఎప్పుడూ అదే క్లాస్ పై క్లాస్ కెళ్ళే దెప్పుడూ? మా అన్న చదివినప్పుడూ మా క్లాస్టీచర్ అదే క్లాసుట, నేను చదివేప్పుడూ అదే క్లాస్ . ఛీ షేం కాదూ ! " అంది అనూ. "కాదు కానీ మా పక్కింటి ప్రవీణ్ అంకుల్ లా కలెక్టరైతే బోలెడన్ని స్వీట్లూ, అవీ ఇవీ అబ్బో ఎన్నొస్తాయో!. ప్రవీణ్ అంకుల్ కొడుకు మా క్లాసే! వాడికున్నన్ని ఆట బొమ్మలు ఎవ్వరికీ లేవు. నేను ఎంచక్కా కలెక్టర్నవుతా. " " నేను మా బాబాయ్ లా లాయర్ నవుతా, బోలెడంత డబ్బు, గడగడా మాట్లాడి అందరినీ బెదర గొట్టొచ్చు.. ఎన్ని అబద్ధాలు చెప్పినా ఫరవా లేదు. ఎవ్వరూ ఏమీ అనరుట! " " నేను మా ఎదురింటి అంకుల్ లా డాక్టర్ నవుతా. డాక్టరైతే అంతా నమస్కారాలు చేస్తూ ఉంటారు. “ " ఛా ! అందరి కాళ్ళూ చేతులూ, మూతులూ పట్టుకోవాలి, అసెయ్యంగా ! మా మావయ్యలా ఇంజనీర్ నవు తా. ఎంచక్కా కార్లో బుర్రునెళ్ళిపోవచ్చు, కంప్యూటర్లో కావల్సినంత సేపు ఎన్నో గేంస్ ఆడుకోవచ్చు."

" నేను మా అమ్మలా ఎంచక్కా అమ్మనై పోతాను, కమ్మగా పాటలు పాడుతూ ఎన్నెన్నో స్వీట్సూ అవీ వండి పెడుతూ హాయిగా ఇంట్లో నే ఉండ వచ్చు." అని ఒకరూ అంటూ పిల్లలంతా వారికి తోచినమాటలు గడగడా చెప్పసాగారు.

ఇంతలో గేటు తెరుచుకుని కొందరు లోపలికి రాసాగారు. ముందుగా చూసిన చిట్టి " తాతా! ఎవరో బోల్డ్ బోల్డ్ అంకుల్స్ ఎవరి కోసమో వస్తున్నారు" అని అనౌన్స్ చేసేసింది.

" బహుశా సింధూ నాన్నగారి కోసం ఐఉంటుంది." అంటూన్న తాతగారి మాటలు పూర్తి కాక ముందే వారంతా వాలు కుర్చీలో కూర్చునున్న తాత దగ్గరకు వచ్చి , వంగి ఆయన పాదాలకు నమస్కరించి, మెడలో పూల మాలలు వేసి, పండ్లు, స్వీట్లూ ఇచ్చి చుట్టూ మోకాళ్ళ మీద కూర్చుని ఫొటోలు తీసుకున్నారు. "మాస్టారూ ! మీరిక్కడున్నారని నిన్ననే తెలిసింది. మేమంతా మిమ్మల్ని చూడాలని వచ్చాం. బావున్నారా ! మాస్టారు! మీరు చెప్పిన చదువు, మీరు నేర్పిన మానవతా విలువల వల్లే ఈ రోజు మేమంతా ఏ వృత్తి లో ఉన్నా నిజాయతీగా , మానవ సేవా దృక్పధం తో , వృత్తి ధర్మాలు పాటిస్తున్నాం, నేను కలెక్టర్ని, వీడు లాయర్, వాడు డాక్టర్ , ఈతనేమో ఇంజనీర్, వీడేమో ప్రొఫెసర్, ఇహ వాడు .." అంటూ వారిని వారు పరిచయం చేసుకుని ఆతర్వాత " మేం ఎవరమైనా మీరేమా సార్, మాకు చిన్నతనంలో మంచి నేర్పిన దేవుడు." అంటూ అంతా మరో మారు నమస్కరించారు. అదంతా చూస్తున్న సింధూ మాత్రం తాను తప్పక టీచరే కావాలని నిర్ణయించుకుంది మనస్సులో.

నీతి- వృత్తులన్నింటిలోకీ పవిత్రమైనది ఉపాధ్యాయ వృత్తి. సమాజానికి చక్కని సంస్కారమున్న మానవులను అందించే వృత్తి

అది.




డియర్ ఫ్రెండ్!

నమస్తే! ఎలా ప్రారంభించాలో, ఏమని వ్రాయాలో తెలియటం లేదు. ముందుగా, నీకు లెటర్ వ్రాసే ధైర్యం చేసినందుకు నన్ను అభినందిస్తావో, అభిశంసిస్తావో నీ యిష్టం. నేను ఎప్పుడూ ఈ ఊరు వచ్చేది నీ కోసమే. ఈసారి వచ్చింది కూడా నిన్ను చూడాలనే. నిజం. యిక్కడకు వచ్చిన వెంటనే మీ వీధి లోకి వచ్చాను. నీ దర్శనం అయింది. చిరు నవ్వుతో పలకరించావు. జన్మ ధన్యమయిందనిపించింది. కాని, నువ్వు “కంప్యూటర్ ఇనిస్టిట్యూట్” కు రావటం లేదని తెలిసి, నేను మ్రాన్పడి పోయాను. ఎందు కోసమైతే యిక్కడకు వచ్చానో, ఆ ధ్యేయం (నీ నిత్య దర్శనం) నెర వేరని నాడు యిక్కడ ఉండటం వృధా. కాని పరిస్థితుల వల్ల యిక్కడ ఉండక తప్పటం లేదు.

నాదో చిత్రమైన మనస్తత్వం. ముఖ్యంగా ఆడ పిల్లల విషయంలో. అది నేను పెరిగిన వాతావరణం వల్లనో ఏమో ఆడ

పిల్లలతో మాటాడాలంటే చాలా మొహ మాటం. కనీసం వారు పలకరించినా, బదులు పల్క లేని సిగ్గు. అటు వంటి నేను నీ విషయంలో ఎందుకు మారానో నాకే అర్ధం కావటం లేదు. నిన్ను 'హలో' అని పలకరించే ధైర్యం ఎలా చేయ గలిగానో, నీతో చనువుగా ఎలా మాట్లాడానో తలచుకుంటే నాకే ఆశ్చర్యం వేస్తుంది. అది ఎదుటి మనిషిని ఆకట్టుకొనే నీ మనస్తత్వం, ఎల్లప్పుడూ విర బూసిన రోజాలా చిరునవ్వులు చిందించే నీ ముఖారవిందం వల్లనేమో అనిపిస్తుంది.

నిన్ను మొదటి సారిగా కలిసిన నాటి నుండి నేటి వరకు, అనుక్షణం నువ్వు నా తలపులలో నిండి పోయావు. కనులు మూసినా, కనులు తెరచినా నీ ఆలోచనలే. నీ రూప చిత్రణలే. నా మనసులోని భావాలను అందంగా అక్షరాల రూపంలో పేర్చటం నాకు చేత కాక పోవటం బాధగా అనిపిస్తోంది. నేను, రెండు, మూడు రోజులలో మా ఊరు వెళ్ళి పోతాను. మరల కాలేజికి వెళ్ళాలి. దీనితో పాటుగా నా అడ్రస్ వ్రాస్తున్నాను. వెంటనే నీ చిరునామాతో ఉత్తరం వ్రాస్తావు కదూ.

వేయి కళ్ళతో అనుక్షణం నీ జవాబు కోసం ఎదురు చూస్తుంటాను.....

సదా నీ వాడిని కావాలనుకొనే

'శశి'

లెటర్ టైపు చేయటం పూర్తయినా, నాచేతి వణుకు తగ్గ లేదు. అది టైపు చేయటం వలన వచ్చినది కాదు, మనసులోని ఆలోచనలు, భావాలు ఒక్కుమ్మడిగా ముసిరి, దాడి చేయటం వలన, జీవితంలో మొట్ట మొదటి ప్రేమ లేఖ వ్రాయటం వలన కలిగినది. నా చేతి వ్రాత నాకే అర్ధం కానంత అందంగా వుంటుంది. అందుకే, కంప్యూటర్ లో టైపు చేసాను. ఎగ్జిక్యూటివ్ బాండ్ పేపర్ పై ప్రింట్ తీసి, నా అడ్రస్ ఒక స్లిప్ పై వ్రాసి, రెండింటిని ఒక కవర్ లో పెట్టాను. కవర్ పైన "ప్రేమతో ప్రియకు" అని వ్రాసాను.

ప్రియ..... పేరులాగే నాకు ప్రియాతి ప్రియమైన ప్రియదర్శిని. ఆమెను తొలి సారిగా చూసింది, ఆర్నెల్ల క్రితమనుకుంటా. మా ఊరు నుండి డిగ్రీ రెండవ సంవత్సరం పరీక్షల తరువాత శలవులలో మావయ్య ఊరికి వచ్చాను. ఖాళీగా ఉండడం ఎందుకని తను నడుపుతున్న చిన్న కంప్యూటర్ ఇనిస్టిట్యూట్ లో నేర్చుకుంటూనే ఇనస్ట్రక్టర్ గా ఉండే వాడిని. కంప్యూటర్ అంటే పెద్దగా ఇంకా పరిచయం కాని రోజులవి. మావయ్య నన్ను ఇనిస్టిట్యూట్ లో ఉంచి, తను బయటి పనులపై వెళ్ళేవాడు. నేను ఇనిస్టిట్యూట్ లో కూచుని ఏదో ఒక పుస్తకం తీసుకుని చదువుకుంటూండే వాడ్ని. వేరే విషయాలు ఏమీ పట్టించుకొనే వాణ్ణి కాదు. ఎవరైనా స్టూడెంట్స్ ప్రాక్టీస్ చేసేటప్పుడు సందేహాలు వ్యక్తం చేస్తే సాయం చేయడం తప్పితే, వేరే విషయాలే మాట్లాడేవాడ్ని కాదు.

ముఖ్యంగా ఆడ పిల్లలయితే, వారి ముఖం కేసే చూసే వాణ్ణి కాదు. ఏమయినా అడిగినా, తలొంచుకొనే సమాధానానం చెప్పే వాణ్ణి.

నే వెళ్ళిన రెండో రోజో, మూడో రోజో నేను ఇనిస్టిట్యూట్ లో కూర్చుని న్యూస్ పేపర్ చదువుతున్నాను. "ఎక్స్ క్యూజ్ మి సర్!" అనే పిలుపుకు పేపర్ లోంచి తలెత్తి బయటకు చూసాను. నా ఎదురుగా ఒక అమ్మాయి నిల్చుని ఉంది. షాంపూ చేసి, గాలికి స్వేచ్ఛగా ఆర బెట్టిన జుట్టు, ఆకర్షణీయమైన కళ్ళు, తాజాగా విరిసిన రోజా లాంటి పెదాలతో చిందిస్తున్న చిర్నవ్వు, ముత్యాల్లాంటి పలు వరుస, బంగారు రంగు మేని ఛాయతో, అటు వంటి అమ్మాయిని ఈ ఇనిస్టిట్యూట్ లోనే కాదు, అంత వరకూ మరెక్కడా చూడలేదనిపించేంత అందంగా ఉంది. గులాబి రంగు పంజాబి డ్రెస్సులో హుందాగా నిల్చుని ఉంది. ఉలుకూ, పలుకూ లేకుండా ఆమెకేసే చూస్తున్న నా దృష్టిని మరలా ఆమె పిలుపే మరల్చింది. 'ఎస్,, ఏం కావాలండీ".. అని అడిగాను, తడబడుతున్న గొంతుతో. "కంప్యూటర్ ఆన్ కావటం లేదు", అంది. వెంటనే లేచి, ఆమె చూపించిన కంప్యూటర్ వద్దకు వెళ్ళి. క్రిందా మీదా పడి మొత్తానికి ఆన్ చేయ గలిగాను. "థాంక్యూ వెరీ మచ్" అంటూ, ఆమె కూర్చుని టైపు చేస్తోంది – ఎం.ఎస్. వర్డ్ ఎక్సర్సైజులు అంటే, ఈ మధ్యనే జాయిన్ అయిందన్న మాట అనుకున్నాను.

మరో పావు గంటకి ఆమె తన ఎక్సరసైజు పూర్తి చేసుకొని వచ్చింది. అంత వరకూ ఆమె కేసే చూస్తున్న చూపు మరల్చుకుని, ఆమె తీసి ఇచ్చిన పేపర్ దిద్దటానికి తీసుకున్నాను. ఎక్కడైనా చిన్న తప్పు దొరుకుతుందేమో, ఆ వంకతో "ఈసారి బాగా చెయ్యండి" అంటూ సలహా ఇద్దామనుకున్న నాకు నిరాశే ఎదురయ్యింది. ఆమె లాగే, ఆమె వర్క్ కూడా అందంగా, పొందికగా ఉంది. ఎక్కడా తప్పు ఎంచ లేక, చివర్న నా సంతకం చేసి (అవసరం లేక పోయినా), ఆమె చేతికిచ్చాను. అతి కష్టం మీద నోరు పెగల్చుకుని, "చాలా బాగా చేసారు, కీపిటప్" అన్నాను. ఆమె చిర్నవ్వుతో "థాంక్యూ" అంటూ రాజ హంసలా నడచుకుంటూ వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిన తరువాత ఆమె పేరు కోసం వెతికాను. దొరికింది. "ప్రియ దర్శిని- వాటే స్వీట్ నేమ్" నాలో నేనే అనుకున్నాను.

మర్నాటి నుండి నా తీరే మారిపోయింది. ఇనిస్టిట్యూట్ లో, ముఖ్యంగా ఆమె వచ్చే టైముకు కూర్చోవటం దిన చర్యగా మారి పోయింది. ఆమె టైముకు అర గంట ముందు గానే, నీట్ గా తయారై కూర్చునే వాడిని. ఒక వేళ బావ ఉన్నా, "నేను చూసుకుంటాను కదా, బావా నువ్వు వేరే పనులు చూసుకో" అనే వాడిని. ఆమె లోనికి రాగానే, 'హల్లో గుడ్ మార్నింగ్!" అని నేను పలకరించటం, ఆమె చిర్నవ్వుతో రెస్పాన్స్ ఇవ్వటం సాధారణమై పోయింది. ఒక వారం రోజుల తరువాత ఆమెను యధాలాపంగా అడిగాను, "ఏమి చదువుతున్నారు?" అని. వెంటనే, ఆమె "ఎందుకు"? అంది. ఊహించని ఆ సమాధానానికి తడబడుతూ, తల దించుకుని, "ఏమి లేదు, ఊరికే" అన్నాను. ఆమె నవ్వుతూ "డిగ్రీ ఫస్ట్ ఇయర్" అని చెప్పింది. దాంతో మరలా ధైర్యం వచ్చి, ఈ ఊరేనా? అన్నాను. "కాదు, విజయవాడ నుంచి వచ్చాం, మా నాన్న గారికి ఇక్కడికి ట్రాన్సఫర్ అవ్వడంతో..." అంటూ తుర్రున వెళ్ళి పోయింది. తరువాత వివరాలు సేకరించగా, వాళ్ళ నాన్న గారు ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టరని, బ్రదర్ కూడా మెడిసిన్ చదువుతున్నాడని తెల్సింది.

అక్కడ ఉన్న రోజుల్లో, ఆమె నాకు మానసికంగా చాలా దగ్గరయింది.   ఆమె లేక పోతే నేను బ్రతక లేనన్న భావం నన్నావరించింది.   ఆమె నాతో తప్ప మరెవ్వరి తోనూ మాట్లాడక పోవడం, మరెవ్వరి వైపూ కన్నెత్తైనా చూడక పోవటం, ఆమెకు కూడా నేనంటే ఇష్టమే నన్న అభిప్రాయం ఏర్పరచింది. తరువాత కొన్ని రోజులకు, నేను మా ఊరు వెళ్ళాను.   మరలా, ఒక వారం రోజులు శలవులు రావటంతో యిక్కడకు వచ్చాను. రాగానే, ప్రియకు ఇద్దామని ఈ లెటర్ తయారు చేశాను.   తరువాత తెలిసింది- తను పరీక్షల వలన కంప్యూటర్ ఇనిస్టిట్యూట్   కు రావటం లేదని.   ఇదీ జరిగిన కథ.

ప్రింట్ తీసిన ఉత్తరం ఉన్న కవర్ జాగ్రత్తగా బీరువాలో పుస్తకాల మధ్య దాచాను, మావయ్యకు, అత్తయ్యకు తెలిసే వీలు లేకుండా. ఈ సాయంత్రం ఎలాగైనా తనకు ఈ లెటర్ అందజేయాలి. కాని ఎలా? నేను లైబ్రరీకి వెళ్ళేటప్పుడు దూరమైనా వాళ్ళింటి ముందు దారి నుండే వెళతాను. ఆమె దర్శనం కోసం. ఆ టైములో ఆమె చూస్తుండగా ఆమె గుమ్మం ముందు కవర్ పడేయాలి. ఎందువల్ల నంటే, ఆమె చేతి కిచ్చే ధైర్యం నాకు లేదు... సాయంత్రం తయారై వెళ్ళిన నాకు వాళ్ళింటి దగ్గర ఆమె కనిపించింది. పలకరించింది చిర్నవ్వుతో, పక్కన వాళ్ళ అమ్మతో. తల వంచుకొని బుద్ధి మంతుడిలా వెళ్ళొచ్చేసాను. అదే విధంగా మరో నాలుగు రోజులు గడిచాయి. కాని ఆమెకు లేఖనందజేయటం మాత్రం జరగ లేదు. దానికి ఒక కారణం పరిస్థితులు అనుకూలించక పోవటం అయినప్పటికీ, ముఖ్య కారణం నా భయమే అనటంలో సందేహం లేదు. యిక, రెండు రోజుల్లో కాలేజి తెరుస్తారు. మా ఊరు వెళ్ళి పోవాలి. ఈ లోగా ఆమెకి లెటర్ యివ్వటం కుదురుతుందా? లేదా? కుదరక పోతే మళ్ళీ ఆమెకి లెటర్ యిచ్చే అవకాశం ఉండదు. యిదే ఆలోచనలతో మనస్సంతా ఆందోళనతో ఆ రోజు రాత్రంతా నిద్ర లేకుండానే గడిపాను. తెల్ల వారుతుండగా కాస్త కునుకు పట్టింది.

పొద్దున లేచేటప్పటికి, ఆ రోజు సోమవారం, అక్కడ వారపు సంత కావటంతో, ఇనిస్టిట్యూట్ బజారు కు దగ్గర గానే ఉండడంతో, వీధంతా కోలాహలంగా వుంది. అప్పుడు వచ్చిందో ఆలోచన. ఈ రోజు సంతకు కూరల కోసం ప్రియ వస్తుంది కదా, ఏదో విధంగా ఆమెననుసరించి, లెటరివ్వాలి అనుకున్నాను. తొందరగా స్నానం చేసి,   తయారై, వీధి గుమ్మంలో నుంచున్నాను. టైము గడుస్తోంది గాని, ఆమె కనిపించటం లేదు. ఎండ మొహం మీదకు పడుతున్నా, ఓపిగ్గా నిరీక్షిస్తున్నాను. 11.30 అయ్యేటప్పటికి ఆమె కనిపించింది, కూరల కోసం వస్తూ. చంద్రుని చూసిన కలువలా నా మనసు వికసించింది ఆనందంతో. ఎలాగైనా ధైర్యం చేసుకొని, ఆమెకి లెటరిద్దామని నిర్ణయించుకుని లోనికి వచ్చాను. యింతలో మావయ్య పిలిచాడు, ఏదో అర్జెంటు వర్క్ చేసి పెట్టమని, తనకు బయటకు వెళ్ళే పని ఉందని. ఒక్క సారిగా నా ఉత్సాహం నీరు కారినట్లైంది. భారమైన హృదయంతో కంప్యూటర్ ముందు కూచున్నాను.

నా శక్తి నంతా ఉపయోగించి సాధ్యమైనంత వేగంగా వర్క్ పూర్తి చేసి, బయటకు వచ్చాను. ఆమె కనిపించ లేదు. ఆ వీధంతా కలియ జూసినా లేదు. నా మనసంతా చేదు భావనతో నిండి పోయింది. అరుదుగా లభించిన ఈ అవకాశం జార విడుచుకో వలసి వచ్చిందన్న బాధ, ఉక్రోషం మనసులో ముప్పిరి గొన్నాయి. కళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి. ఆ రోజు సాయంత్రమే మా ఊరికి బయల్దేరాను. భారమైన గుండెతో.

రెండు వారాలు గడిచాయి. పరీక్షలు దగ్గర పడుతుండటంతో చదవ వలసిన, వ్రాయ వలసిన పని ఎక్కువగా ఉన్నప్పటికీ, ఆమె తలపులు నా మనస్సు లోంచి చెరగటం లేదు. ఈ బాధకు ఏదైనా పరిష్కారం చూడాలి. ఆది వారమంతా తీవ్రంగా ఆలోచించాను. ఆలోచనలన్నీ ఒక కొలిక్కి రాగానే, అమ్మతో చెప్పాను – మర్నాడు మావయ్య ఊరు వెళ్ళాలని. 'అంత అర్జంటు పని ఏముందిరా?' అని అమ్మ అడిగింది. 'ముఖ్యమైన పని ఉంది వెళ్ళాలి అంతే' అన్నాను. మర్నాడు పొద్దున్నే ఏడు గంటలకు డైరెక్టు బస్ ఉంది, దానికి వెళ్దామని నిర్ణయించుకున్నాను. రాత్రంతా నిద్ర లేక పోవటంతో, తెల్లవారు ఝామున ఐదు గంటలకే లేచి స్నానం చేసి కూర్చున్నాను. ఆరున్నరకు బయల్దేరుతుండగా 'టిఫిన్ చేస్తున్నాను, తినేసి వెళ్దువు గాని, కూచో" అంది అమ్మ. వద్దన్నాను. "నీరసంతో ఏం వెళతావు? తీరా వెళ్ళేటప్పటికి ఏ టైమవుతుందో..." అంటూ కసురుకుంది. యింకా మొండి కేస్తే, ప్రయాణమే వద్దంటుందనే భయంతో సరేనన్నాను. 8.30 కి గాని టిఫిన్ తయారు కాలేదు. అతి కష్టం మీద నిప్పుల మీద కూచున్నట్లుగా ఉంది నాకు. గబ గబా అయిందనిపించి, బ్యాగ్ భుజాన తగిలించుకున్నాను. లెటర్ ఉంచిన కవర్ ఒక పుస్తకంలో పెట్టి బ్యాగ్ లో పెట్టడం మాత్రం మర్చి పోలేదు. వేగంగా బస్టాండుకి చేరాను. కిళ్ళీ కొట్టు వాణ్ణి అడిగాను. బస్ ఏమైనా ఉందా? అని. 'యిప్పుడే డైరెక్టు బస్ వెళ్ళి పోయింది బాబూ, మరో గంట దాకా డైరెక్టు బస్సు లేదు' అన్నాడు. నాకు నెత్తిన పిడుగు పడ్డంత పనయ్యింది. చి! ఎంత దురదృష్టం అనుకుంటూ నన్ను నేనే తిట్టుకున్నాను. అసహనం పెరిగి పోతోంది. టైమ్ తరిగి పోతోంది. మరో 20 నిమిషాలకు ఒక షటిల్ బస్సు వచ్చింది. అది కొంత దూరం వరకే వెళ్తుంది. మళ్ళీ యింకో బస్సు మారాలి. అయినా ఏం చేస్తాం, ముందు ఎక్కేస్తేనే మంచిది అనుకొని బస్సెక్కి కూచున్నాను. షటిల్ బస్ కావటంతో మరో అర గంటకి గాని బస్ కదల లేదు. 9.30కి స్టార్ట్ అయ్యింది. డైరెక్టు బస్సు దొరికితేనే ఒకటిన్నర గంట పైగా ప్రయాణం. అటువంటిది, షటిల్ బస్సులో ఎప్పటికెళ్ళేను? అనుకుంటూ నా మనసు మూలుగుతోంది. ప్రియ, సంతకు 11-12 గంటల మధ్య నే వస్తుంది. 11 గంటలకి ఎలా వెళ్ళటం? నాకేం తోచటం లేదు. టిక్కెట్ తీసుకున్నాను. ముక్కుతూ, మూల్గుతూ కుంటుతూ నడుస్తోంది బస్సు. "ఇంకొంచెం స్పీడుగా పోనియ్య రాదూ?" ఉక్రోషం ఆపుకో లేక అడిగాను డ్రైవర్ని. "యిది యిప్పుడే షెడ్ నుంచి వచ్చిన బండి. స్పీడు కొడితే, మొత్తానికే ఆగి పోతుంది". కటువుగా సమాధానమిచ్చాడు డ్రైవరు.

బస్ బయల్దేరిన పది నిమిషాలకే బస్సులో ఏదో గొడవ మొదలైంది. ఏంటీ అంటే, ఎవరో పెట్రోలు తెస్తున్నారట. కండక్టరు కుదరదంటాడు. దాంతో బస్సు మొత్తానికి ఆపేసారు. నాకు ఏడుపొక్కటే తరువాయి. గొడవ పడుతున్న వాళ్లకి సర్ది చెప్పే ప్రయత్నం చేసాను. నాకే చివాట్లు దక్కాయి. మొత్తానికి పెట్రోలు తెస్తున్న మనిషి డబ్బాతో సహా దిగితే గాని, బస్సు తిరిగి బయల్దేర లేదు. అతి కష్టం మీద మరో అర గంటకి బస్ స్టాండు చేరింది. యిప్పుడు మరో బస్ వస్తుందో రాదో, అనుకుంటూ దిగాను. టైమ్ చూసాను. 10.50. అప్పటికది పదిహేనో సారో, పదహారో సారో టైము చూడటం. ఎంక్వయిరీలో బస్ ఎన్నింటికుందని అడిగాను. మరో గంటకి- అని సమాధానం. అయి పోయింది. ఈ చాన్సు కూడా దాదాపు మిస్సయినట్లే అనిపించటంతో నా మనసంతా బాధతో నిండి పోయింది. నిప్పుల మీదున్నట్లుగా గడిచింది- ఆ గంట. అయినా బస్ రాలేదు. మరో పావు గంటకి వచ్చింది. ఎక్కి టికెట్ తీసుకుని, కళ్ళు మూసుకుని కూచున్నాను. కళ్ళలో నీళ్ళూరుతున్నాయి. ఎన్నడూ లేనిది, ఈ ప్రేమ వ్యవహారంలో పడ్డాక, నేను బేలగా మారుతున్నానేమోననిపించింది. మనసంతా ఆలోచనలు రొద చేస్తున్నాయి. ఎక్కడో గోరంత ఆశ. నా ప్రయత్నం సఫలమవుతుందని. నా ఆశకు నాకే నవ్వొచ్చింది. అలాగే కళ్ళు మూసుకున్నాను.

కళ్ళు తెరిచేటప్పటికి బస్ నే చేరాల్సిన ఊరుకి దగ్గరగా వచ్చేసింది. టైము చూసాను. 12.20. మరో 15 నిమిషాలకల్లా గమ్యం

చేరింది. టైము 12.35. బస్ దిగుతూనే, పరుగు లాంటి నడక మొదలెట్టేను. యింకా ఆశ చావ లేదు. తొందరగా వెళ్తే, బజార్లో కనబడే అవకాశం వుంది. మరో రెండు నిమిషాల్లో, ఇనిస్టిట్యూట్ కు చేరుకున్నాను. బజార్ అంతా కోలాహలంగా ఉంది. గుమ్మం లోంచే చూసాను. ఎక్కడైనా ఉందేమోనని. ఒక్క సారిగా ఆశ్చర్యం నన్నావరించింది. హృదయం ఆనందంతో నిండి పోయింది. అవును. ఆమె కనిపించింది. నా కళ్ళను నేనే నమ్మ లేక పోతున్నాను. ఆమె కూరల కొట్టు దగ్గర ఉంది. వెంటనే పరుగుతో ఇనిస్టిట్యూట్ లోకి అడుగు పెట్టి, బేగ్ లోపల పడేసి, కవర్ జేబులో పెట్టుకొని, బయట పడే సమయంలో అడ్డొచ్చారు- యమ కింకరుల్లాంటి సీనియర్ స్టూడెంట్స్ "హల్లో గురూ, ఎప్పుడొచ్చావు?" అంటూ. అతి కష్టం మీద నవ్వటానికి ప్రయత్నిస్తూ, "యిప్పుడే" అన్నాను. "ఏంటి విశేషాలు?" అంటూ జిడ్డులా పట్టుకొని వదలటం లేదు. వాళ్ళని కాదని వెళ్ళటానికి లేదు. వీళ్ళ కళ్ళకి ఏమాత్రంగా అనుమానంగా కనపడినా, విషయం కని పెట్టి, ఊరంతా టముకు వేసేస్తారు. వీళ్ళకు దొరక్కుండా ప్రియని కలవాలి...ఎలా? నాకు ఎక్కువ శ్రమ లేకుండానే, మరో ఐదు నిమిషాలకి వాళ్ళే వెళ్ళి పోయారు, అర్జెంటు పనుందంటూ. నా యిష్ట దైవానికి మనస్సు లోనే నమస్కారాలు అర్పించుకున్నాను.

బయట కొచ్చి చూసేటప్పటికి, ఆమె కనిపించ లేదు. నాకళ్ళు వర్షించటానికి సిద్ధంగా ఉన్నాయి. వీధంతా కలియ తిరిగాను. కాని, ఆమె లేదు. వెళ్ళి పోయిందన్న మాట, అనుకుంటూ, జారి పడుతున్న కన్నీళ్ళని తుడుచుకుంటూ, బరువెక్కిన గుండెతో వెనక్కి తిరిగాను. అప్పుడు కనిపించింది- ఆమె, సాయిబు కొట్టు దగ్గర నిమ్మకాయలు కొంటూ. నా ఆనందం అవధులు దాటింది. మనసు పరవళ్ళు తొక్కుతోంది. వేగంగా సాయిబు కొట్టు దగ్గరకి వెళ్ళాను.ఆమె ప్రక్కన నుంచున్నాను. సడెన్ గా నన్ను చూడటంతో చాలా ఆశ్చర్యపడినట్లు కనిపించినా, నవ్వుతూ, "హలో బాగున్నారా?" అని అడిగింది. "హా.." అన్నాను. "నువ్వు బాగున్నావా?" అని అడగుదామనుకున్న మాట లోపలే ఉండి పోయింది. గొంతు పూడుకున్నట్టనిపించింది. రెట్టించిన నా హృదయ స్పందన నాకే స్పష్టంగా వినిపిస్తోంది. తన దగ్గరకి వెళ్ళటమైతే వెళ్ళాను గాని, అసలు విషయం ఎలా ప్రారంభించాలో, ఆ లవ్ లెటర్ ఆమెకు ఎలా ఇవ్వాలో నాకు తెలియటం లేదు.

"ఏం కావాలి బాబూ?" అని సాయిబు అడగటంతో, తడ బడుతూ, "నిమ్మ కాయలు- ఒక అర డజను" అన్నాను. ధైర్యం కూడ గట్టుకుని, ఆమె కేసి చూస్తూ, "నేను ఈ రోజే ఊరి నుంచి వచ్చాను, క్రితం వారం వెళ్ళి" అన్నాను. "అలాగా!" అంది, ముక్త సరిగా. నాకు ఏం చెయ్యాలో తోచటం లేదు. చెమటలు పట్టేస్తున్నాయి. ఈ సంభాషణ నెలా పొడిగించాలో అనుకుంటుంటే, సాయిబు నిమ్మకాయలిచ్చేడు. "అయ్యో, అవి బాగోలేవండి", అంది ప్రియ. 'హమ్మయ్య, వంక దొరికింది" అనుకుంటూ, "అయితే, కాస్త నువ్వే ఏరిపెట్టు" అన్నాను. నవ్వుతూ ఏరి పెట్టింది. తన బ్యాగు తీసుకుని వెళ్ళి పోబోతోంది. ఆఖరి ట్రంపు కార్డుగా, "ఐదు రూపాయలు చిల్లరుందా, నీ దగ్గర – నా దగ్గర వంద నోటుంది?" అన్నాను ప్రియతో. నీ ఎత్తుగడ నాకు తెలుసులే అన్నట్లుగా చూసి, ఐదు రూపాయలు సాయిబు కిచ్చింది. ఆ సమయం లోనే నేను ధైర్యం తెచ్చుకొని, జేబులోని కవర్ తీసి, తన కూరల సంచిలో వేసి, వెనక్కి తిరిగాను. "ఏంటండి యిది?" అని ఆమె అంటున్నా వినిపించుకోకుండా వడి వడిగా ఇనిస్టిట్యూట్ కు వచ్చేసాను. మరో అర గంటకు గాని నా గుండె దడ తగ్గ లేదు. ఏమైనప్పటికీ, ఒక ఘన కార్యం "ఆపరేషన్ లవ్ లెటర్" పూర్తయింది. "మరి వాటెబౌట్ హర్ రిప్లై? "వెయిట్, అండ్ సీ"- అని సమాధానపరిచింది నా మనసు.




విజయవాడలోని ఒక కల్యాణ మంటపం.

అచ్యుతరావు అన్న కొడుకు పెళ్లి.

తమ్ముడిగా అన్నయ్యకి అన్ని కార్యక్రమాల్లో చేదోడువాదోడుగా ఉండి కార్యం గట్టెక్కించాడు. పందిట్లో మంగళసూత్రధారణ పూర్తవడంతో మానసికంగా, శారీరకంగా కాస్త రిలాక్స్ అయ్యి టెంట్ లో ఫ్యాన్ దగ్గరగా ఉన్న కుర్చీలో రిలాక్స్ గా కూర్చున్నాడు అచ్యుతరావు.

అన్నదమ్ములిద్దరివీ మధ్యతరగతి జీవితాలే. కష్ట సుఖాల్లో కష్టాలపాల్లెక్కువే అనుభవిస్తూ సంసారబాధ్యతను గట్టెక్కించే ప్రయత్నం చేస్తున్నారు.

"నమస్కారం అచ్యుతరావుగారూ" తనకు దగ్గరగా వచ్చి కుర్చీలో కూర్చుంటూన్న స్నేహితుడు శ్రీధర్ పలకరింపుకి సన్నటి నవ్వుతో సమాధానం ఇచ్చాడు.

"మీ అమ్మాయి గాయత్రికి ఎప్పుడు పెళ్లి చేసి మా అందరికీ ఇలా పప్పన్నం పెడతారు?"అన్నాడు.

ఆ మాటవిని అప్పటిదాకా కాస్త రిలాక్సైన ఆయన మనసును మళ్లీ విషాదవీచిక ఆవరించింది.

అచ్యుతరావుకి ఇద్దరు కూతుళ్లు. పెద్దమ్మాయి దుర్గకు కాలూ చెయ్యీ కూడదీసుకుని అయినంతలో బాగానే పెళ్లి చేశాడు. కాని అల్లుడు ఉత్త నాసిరకమని పెళ్లయిన కొత్తల్లోనే తేలిపోయింది. అమ్మాయిని చక్కగా చూసుకోకపోగా, గొంతెమ్మ కోర్కెలతో అచ్యుతరావుని తెగ ఇబ్బందిపెడుతుంటాడు. ఇదిలా ఉండగా గాయత్రికి సంబంధాలు వస్తున్నా కట్న కానుకల దగ్గరో, అందం చదువులాంటి ఇతరత్రా విషయాల్లోనో బెడిసికొడుతున్నాయి.

గాయత్రి నిజంగా గాయత్రీదేవే! ఛామనఛాయ అయినా కళగల ముఖంతో ఆకట్టుకుంటుంది. ఇంటిపనిలో నేర్పు, మంచి ఓర్పు ఉన్న పిల్ల. ఆ ఒక్క పిల్లనీ యోగ్యుడైన అయ్య చేతిలో పెడితే ఇహ తను కాస్త కుదుటపడొచ్చన్నది అచ్యుతరావు ఆలోచన.

"ఏవండీ అచ్యుతరావుగారూ ఎలా ఉన్నారు? అసలు చాలాకాలం నుంచి మిమ్మల్ని కలుద్దామని ప్రయత్నిస్తున్నాను. హమ్మయ్య, ఇలా ఇక్కడ కలవడం చాలా ఆనందంగా ఉంది. అసలు విషయం ఏంటంటే, మనమ్మాయి గాయత్రికి ఒక సంబంధం చూశాను. అబ్బాయి అందగాడు, మృదుస్వభావి, నెలకు లక్షవరకూ సంపాదన.."కాస్త ఆగి అప్పుడే అటుగా మంచినీళ్లు ఇస్తూ ఎవరో రావడంతో గ్లాసందుకుని నీళ్లు తాగసాగాడు పూర్ణానందం.

'ఇప్పటిదాకా ఎన్ని సంబంధాలు చూడలేదు. మొదట్లో బాగానే ఎంటరవుతారు, తర్వాతే రెడ్ సిగ్నల్ చూపిస్తారు. తన కూతురికీ, తనకూ మానసిక క్షోభ. అయినా ఇన్ని సుగుణాలు ఉన్న అబ్బాయికి మా అమ్మాయి, ఇంటి పరిస్థితులూ ఏం నచ్చుతాయి. వృధాప్రయాస..అంతే' అచ్యుతరావు మనసులో ఆలోచనల సుడిగుండాలు.

"అన్నట్టు..ఎంతవరకూ వచ్చాం..అబ్బాయిగురించి చెబుతున్నాకదూ..అబ్బాయి శ్రీకాంత్ నాకూ చాలాకాలంగా తెలుసు. మంచి నడవడిక. పెద్దలంటే, వినయం, విధేయత, గౌరవం..కానైతే.." అని కాసేపాగి "అబ్బాయి రెండోపెళ్లివాడు. మొదటి భార్య అనారోగ్యంతో చనిపోయింది. పాపం ఆమెని బ్రతికించుకుందామని చాలా తాపత్రయ పడ్డాడు. కాని ప్చ్..విధి సహకరించలేదు. అతనికి పిల్లలేం లేరు. మీరు ఆలోచించుకుని 'ఊ' అంటే..మిగతా ఏర్పాట్లు నేను చేస్తాను"అన్నాడు.

'అనుకున్నాను..ఏదో ఒక లోపం లేకపోతే చక్కటి సంబంధం తన దాకా ఎలా వస్తుంది?' మనసులో అనుకుని "ఇంట్లో చర్చించి నేను ఏ విషయం చెబుతాను"అన్నాడు.

"పిల్లాడు రెండో పెళ్లివాడన్నమాటేగానీ చాలా చాలా మంచివాడు. నేను గ్యారంటీ ఇస్తాను..అతనితో అమ్మాయి కాపరం సలక్షణంగా ఉంటుంది"అని వెళ్లిపోయాడు.

*****

అచ్యుతరావు ఇంట్లో పూర్ణానందం చెప్పిన విషయం చెప్పాడు.

ఇప్పుడు గాయత్రి మనసులో ఆలోచనలు సుళ్లు తిరుగుతున్నాయి 'తన పెళ్లికోసం పాపం తండ్రి ఎంతో తల్లడిల్లిపోతున్నాడు. అక్కకి మొదటి పెళ్లివాడేవచ్చాడు. కానీ ఏం లాభం? దాని ముఖంలో పెళ్లిరోజున చిరునవ్వు చూడ్డమే! సదా బాధావీచికే! నిజానికి అమ్మాయికి పెళ్లంటే లాట్రియే. తేడా వచ్చిందంటే జీవితం కోల్పోయినట్టే! తనకిప్పుడు రెండో పెళ్లి సంబంధం వచ్చింది. సెకెండ్ హేండ్! అతనెలాంటివాడో. పూర్ణానందంగారు మంచివాడని చెప్పాడంటున్నాడు తండ్రి. ఎవరైనా అలాగే చెబుతారు. లేకపోతే సంబంధాలు ఎలా కుదుర్తాయి. మోసాలు ఎలా జరుగుతాయి? ఆయన చెప్పింది నిజమే అనుకుందాం, కానీ రెండో పెళ్ళివాడే! అనుబంధాలూ, అనుభూతులు మొదటామెతో పంచుకుని ఆ జ్ఞాపకాలతో తనకు దగ్గరవ్వగలడా? ఒకవేళ అయితే..ఏమో..చెప్పలేం? కట్న, కానుకలు ఆశించని అతనితో తన పెళ్లి జరిగితే తండ్రికి కాస్త మానసిక విశ్రాంతి కలుగుతుంది. ఏదేమైనా తను ఛాన్స్ తీసుకోవాలి. తప్పదు' అనుకుని నాన్నా అతనితో పెళ్లి నాకిష్టమే! పెళ్లి చూపులకు ఏర్పాట్లు చేయించండి"అంది.

కూతురి నిర్ణయం వెనకాల తన అశక్తతే కారణమని తెలిసినా ఏం చేయలేక "అలాగేనమ్మా.."అని అక్కడ్నుంచి భారంగా కదిలాడు.

*****

పెళ్లిచూపులు, పెళ్లి పర్వాలు పూర్తయ్యాక మొదటిరాత్రి-

రకరకాలపూలతో అలంకరించబడి, వాటి సువాసనతో, అగరువత్తుల సుగంధ ధూపంతో, పాలూ పళ్లతో ప్రత్యేకంగా అలంకరించిన

ఆ గది ఇద్దరి మనసులనూ మత్తెక్కిస్తూ యవ్వన సంకెళ్లను ఒక్కొక్కటిగా విడిపిస్తోంది.

శ్రీకాంత్ ఆమెని దగ్గరకు తీసుకుని-

"గాయత్రీ నువ్వు నా జీవితంలోకి రావడంతో రెండో పుస్తకం తెరుచుకుంది. దాన్ని మనం అందమైన అనుభూతులతో నింపెయ్యాలి. మొదటిది అనూషతో కూడిన పుస్తకం, మనసా వాచా దాన్ని మూసేశాను. మనిషికి జీవితం దేవుడిచ్చిన వరం. దాన్ని పరిపూర్ణంగా అనుభూతించాలి. అంతేకాని వేదనతో అంతం చేసుకోకూడదు. అనూషకు ఏ లోటూ చెయ్యలేదు. బతికించుకోవాలని ఎంతో ప్రయత్నించాను. కాని విధి నెదిరించలేకపోయాను. అది అక్కడితో సరి. ఇప్పుడు నువ్వే నా జీవితం. నన్ను పెళ్లి చేసుకోమని ఎవ్వరూ ఫోర్స్ చెయ్యలేదు. నాకు నేనే ఈ నిర్ణయం తీసుకున్నాను. చెప్పానుగా ఒక్కసారి లభించే ఈ జీవితాన్ని అందంగా అనుభవించాలని. ఇహ మనసులో నా గురించి లేనిపోని ఆలోచనలు పెట్టుకోకు.      అన్నట్టు మాటలతో ఈ రాత్రిని వృధాచెయ్యకూడదు..ఇద్దరం కలిసి మదనాశ్వంపై స్వారీ చేస్తు స్వర్గ ప్రవేశం చేద్దాం"అని చిలిపిగా నవ్వి మరింత దగ్గరగా వచ్చి గాఢాలింగనం చేసుకున్న శ్రీకాంత్ ను చూసి ‘హమ్మయ్యా..మంచి స్టార్టింగే..’అని మనసులో అనుకుని సిగ్గుల మొగ్గ అయింది.

ఆ మొగ్గను తమకంతో తడిమి తడిమి రేకలన్నీ ఒక్కొక్కటిగా నిదానంగా విచ్చుకుని సంపూర్ణ వికసిత పుష్పమయ్యేలా చేశాడు. ఆపై పరిపూర్ణ వికసిత పుష్పంపై తుమ్మెదలా వాలి మకరందాన్ని గ్రోలడం ప్రారంభించాడు. అలా పునః పునః ఆనందానుభూతినందుకున్నాక ‘సెకండ్ హేండ్ కాదు.. నా మొగుడు మానసికంగా ఫస్ట్ హేండే’ అనుకుంది తృప్తిగా శ్రీకాంత్ గుండెలపై మత్తుగా తల ఆనుస్తూ.

*****

మరుసటిరోజు నుంచి ఆ ఇంట్లో సుఖసంతోషాల పర్వం మొదలై కూతురి ముఖంలో అనిర్వచనీయమైన ఆనందాన్ని గమనించిన అచ్యుతరావు మనసులో మురిసిపోయాడు. శ్రీకాంత్ కేవలం అల్లుడిగానే కాకుండా అచ్యుతరావుకు కొడుకులేని లోటు తీర్చాడు. తోడల్లుడిని తన మాటలతో, చేతలతో కట్టడి చేశాడు. శ్రీకాంత్ ను అల్లుడిగా కుదిర్చిన పూర్ణానందంకు పట్టుబట్టలు పెట్టాలని మనసులో స్థిరంగా అనుకున్నాడు అచ్యుతరావు.

***




" అబ్బా..... అప్పుడే తెల్లవారిపోయిందా ? " అలారం చప్పుడికి మెలకువ వచ్చిన ' జాగృతి ' మెల్లిగా చప్పుడు కాకుండా తన మీద వున్న భర్త చేతిని సుతారంగా తొలగించి నిద్ర తో మూసుకుపోతున్న కళ్ళను బలవంతాన తెరుస్తూ మంచం దిగింది.

" ఛత్ .. రోజూ తెల్లవారురూమునే లేచి, అన్ని పనులూ చేసుకుంటే తప్ప ... తొమ్మిదింటికల్లా ఆఫీస్ లో తన సీట్లో కూర్చో లేదు... ఒకటా ... రెండా... సుమారు ఇరవై ఏళ్ళుగా ఇదే దినచర్య... ఎప్పటినుంచో చెయ్యలేక పోతున్నా ఇప్పుడు మరీ ఇబ్బందిగా వుంటోంది.. అకాల వార్ధక్యం అంటే ఇదేనేమో.... నిజానికి ఇంకా తను నలభై ఏళ్ళు కూడా నిండకుండానే.... ముసలిదయిపోయిందా.... లేకపోతే ... తన ఆలోచనలు, మానసికంగా చెయ్యలేకపోతున్నానన్న ఫీలింగ్ వలన అలా అనిపిస్తోందా? ఆలోచిస్తూనే కాఫీకి ఫిల్టర్ వేసి, ఇంకోపక్క టిఫ్ఫిన్ ఏర్పాట్లు చూసుకు .... గబ గబా వాషింగ్ మెషీన్ లో బట్టలు వేసింది . అప్పుడే ఆరు ... గబ గబా పిల్లలని లేపింది ...బిటెక్ మొదటి ఏడాది చదువుతోంది పెద్ద పిల్ల శృతి, రెండో పిల్ల 'లయ ' చదివేది పదో క్లాస్ ... ఇంక చెప్పాలా... ఏం చదువులో, అసలు పొందుతున్నదేమిటో... పోగొట్టుకుంటున్నదేమిటో... అన్న ఆలోచన... ఈమధ్య తన మనసుని ... బాగా చుట్టుముట్టి వేధిస్తోంది .

" అరే ... అమ్మలూ ... లేవండమ్మా ... అప్పుడే ఏడయిపోతోంది... త్వరగా తెమలండి... మళ్ళీ ఆలశ్యం

అయిందని తినకుండా పరిగెడతారు.... లెండి.... "....

"అబ్బా ... ఏమిటమ్మా...రాత్రి రికార్డ్స్ రాసుకుంటూ లేట్ అయ్యింది... ఒక్క అరగంటలో లేస్తాగా.... " మళ్ళీ ముసుగుతన్నింది పెద్దది.

"అయ్యయ్యో... ఇంకొంచెం ముందు లేపచ్చు కదమ్మా... ఈవేల్టి నుంచి ఆఫ్యేర్లీ ఎగ్జాంస్ .. ఇంకా చదవాల్సినది వుండి పోయింది.... " గాభరాగా అంది లయ....

" చూడు చిన్నీ...అనవసరంగా టెన్షన్ పడకు... ముందునుంచి బాగానే చదివావుగా ... పరీక్ష ముందు.. గాభరా పడి పాడు చేసుకోకు. ప్రశాంతంగా వుండు ..పరీక్ష చక్కగా వ్రాస్తావు. కూర్చోకు.. వెళ్ళి ఫ్రెష్ అయి వచ్చేయి... పాలు తాగి ఓ గంట అన్నీ వల్లె వేసుకో ... అదే సరిపోతుంది."

గబ గబా వాషింగ్ మెషీన్ లోంచి బట్టలు ఆరేసి... స్నానం చేసి వచ్చేసరికి ... అప్పుడే ఎనిమిది ... ఛా.. ఎంత త్వరగా చేసినా తెమలటంలేదు వెధవ పనులు... నన్ను క్షమించు దేముడా ... నీ పనీ..నా పనే ... నే వదిలెయ్యగలిగినవి.... అంటూ ఫ్రిజ్ లోంచి తీసిన నాలుగు పూలు దేముడిమీద వేసి... దీపం వెలిగించి అయిందనిపించే లోగా... వినిపించింది అయ్యగారి గొంతు.." జాగీ .. కాస్త కాఫీ తెస్తావా".. ప్చ్.... ఏళ్ళ నుంచి చెబుతున్నా కొంచెం కూడా మారరు... పనిలో సాయం చెయ్యకపోతే మానే కనీసం కలిపిన కాఫీ గ్లాసు కూడా వంటింట్లోంకి వచ్చి తీసి కెళ్ళరు... ఏమ్మనిషో... ఏదయినా అంటే... అలక ..కట్టుకున్న వాడికి కాసిని కాఫీ నీళ్ళివ్వడానికి కూడా ఏడుపేనా అంటూ.... అయినా ఇది రోజూ వుండేదేగా ... అయినా అనుకోకుండా వుండదు ఈ పనిలేని మనసు.

" ఇదిగో... కాఫీ .. గమ్మున్ని తాగి.. త్వరగా స్నానం చేసి వస్తే ...టిఫిన్ పెడతా...లేకపోతే పెట్టుకు తినాలి... నేను ఈ వేళ కాస్త త్వరగా వెళ్ళాలి... మా ఎం.డి విజిట్ వుంది..."గబ గబా జడ అల్లుకుంటూ అంది...

"మమ్మీ... నాకు కాస్త జడలు వెయ్యవా ....... " గదిలోంచి అరిచింది లయ....

" అబ్బబ్బ ఏం పిల్లలో ... నేనూ బయటికి వెళ్ళాలి అన్న ఆలోచనే వుండదు ఎవరికీ' మనసులోనే అనుకుంటూ ఆ పని కానిచ్చి... " పరీక్ష బాగా వ్రాయి. ఏయ్... శృతీ... ఇంక లే...... లేట్ అయి మళ్ళీ కాలేజ్ మానేస్తావ్.

ఏమండీ ..మీకు అన్నీ టేబిల్ మీదపెట్టా ... ... వింటున్నారా... మరి నే వెడుతున్నా.... " ఒకేసారి అందరికీ చెప్పేసింది ... ఇదే అష్టావధానం .. శతావధానం అంటే కాబోలు .. అదే వేదిక మీద చేసేవారికి బ్రహ్మరథం . యింట్లో యిల్లాలు చేస్తే .. ఎవరికీ లెక్కే ఉండదు .. గుర్తింపూ ఉండదు .. నిట్టూర్చింది అంతలోకే నవ్వుకుంది తన ఆలోచనలకు.

" ఆ ..ఆ ... వెళ్ళిరా ... జాగ్రత్త " పేపర్లోంచి తల ఎత్తకుండానే చెప్పాడు భర్త రమేష్ చంద్ర . చేసేది లెక్చరర్ ఉద్యోగం ... పది గంటలకి వెడతాడు... సాయంత్రం... నాలిగింటికల్లా అయిపోతుంది. అయినా సరే... ఇక్కడ పుల్ల తీసి అక్కడ పెట్టడు... పాపం జాగృతి చేసేది... ఓ కార్పొరేట్ ఆఫీస్ లో సూపర్వైజర్.... పనీ ఎక్కువే... బాధ్యతా ఎక్కువే... ఆఫీస్ లో ఎంత మంచి పేరు వున్నా ... అదంతా ఆమె బాధ్యతగా సరిగా చేసినంత సేపే ఆగుర్తింపూ... గౌరవం... అందుకే.. ఎటువంటి పరిస్తితుల్లోనూ మాట పడకుండా జాగ్రత్తగా వుంటుంది ... ఎన్నో సార్లు అనుకుంది... ఇంక చెయ్యలేక, పోనీ మానేద్దామా అని... కానీ.. ఈ గడ్డు రోజుల్లో కష్టమే ... ... ఒక స్టేండర్డ్ ఆఫ్ లివింగ్ కి అలవాటు పడి పోయాకా ........ ఆలోచిస్తూనే.. కైనటిక్ పరిగెట్టించింది... స్పీడ్ పెంచి. సరిగ్గా టెన్ టు నైన్ ఆఫీస్ లో వుంది... హమ్మయ్యా ..ఇంకా ఎం.డి రాలేదు... ...

***

గుడ్ మానింగ్ మేడం... "నవ్వుతూ విష్ చేసి ... వాటర్ బాటిల్ టేబిల్ మీద పెట్టాడు... ప్యూన్ చంద్రరావ్....

"గు డ్ మానింగ్ ... థేంక్యూ... " చల్లటి నీళ్ళు తాగేసి సీట్లో కూర్చుంది .

అంతా అప్పుడే వచ్చి ,పని మొదలు పెట్ట బోతున్నారు... తను ఎవరు ఆ ఆఫీస్ లో చేరినా మొదటిరోజే చెబుతుంది...

పంక్చువాలిటీ ... క్రమశిక్షణ ఇక్కడ ఖచ్చితంగా పాటించాలనీ... .. ఏ రోజు పని .. ఆ రోజు ఖచ్చితంగా పూర్తి చెయ్యాలనీ... మనకి అన్నం పెట్టి ఆదరిస్తూ... సమాజంలో ఒక స్థాయినీ ... గౌరవాన్నీ ఇచ్చే సంస్థ మనకు తల్లితో సమానమనీ ,ఎవరైనా పని మీద దృష్టి పెట్టక పోతే... అవసరమైతే పనిష్ చెయ్యడానికి కూడా ఏ రోజూ వెరవలేదు... అందుకే తనంటె యాజమాన్యానికి నమ్మకం, గౌరవం... సిబ్బందికి భయం... భక్తీ... ఇన్నాళ్ళ ప్రయాణంలో పని ఎగ్గొట్టింది ... విస్మరించింది, అలక్షం చేసింది కానీ లేదు.

కానీ ఈ మధ్య చేరిన ' ప్రణవి " తన సహనానికి సవాలుగా మారింది.... తనని ఏ మాత్రం లెఖ చేయడం లేదు... అలా అని ఎదిరించదు... పని పెండింగ్ పెట్టదు... కానీ .. అస్సలు ..పంక్చువాలిటీ ... క్రమశిక్షణ పాటించదు.... ఏమైనా అంటే నవ్వేస్తుంది....... ఎలా ... పోనీ ... పైకి రిపోర్ట్ చేద్దామా అంటే... ఉద్యోగాలు దొరకడమే గగనంగా వున్న ఈ రోజుల్లో .. ... మంచి చదువు , చక్కటి పనితనం వున్న ఆ అమ్మాయికి ఎలా అన్యాయం చెయ్యడం.? పోనీ చూసీ చూడనట్లు వదిలేద్దామా అంటే అప్పుడే ... గుసగుసలు మొదలయ్యాయి.... తను 'ఆడ పిల్ల' అనే పక్షపాతంతో వ్యవహరిస్తోందని , ఎప్పుడైనా తమకి పొరపాటున లేట్ అయితే ' లేట్' మార్క్ పెట్టి... మూడు 'లేట్ మార్క్స్ కి ఒక లీవ్ నోట్ చేసే మేడం... ప్రణవి రోజూ ఆలస్యంగా వచ్చినా .... ఆఫీస్ లో గంటలు గంటలు ఫోన్ మాట్లాడినా ఎటువంటి చర్యా తీసుకోవడం లేదని...

నిన్న మరీ మరీ చెప్పింది ..ఈ రోజు ఎం.డి వస్తారనీ త్వరగా రమ్మనీ... ... ఏ క్షణం లో అయినా ఆయన రావచ్చు... అందరూ వచ్చేసారు... ఈ పిల్ల మాత్రం ఇంకా రాలేదు... అందరూ తనకేసి దొంగ చూపులు చూస్తున్నారు ... ఇప్పుడు తనేం చేస్తుందా అని .. ఇన్నేళ్ళ సర్వీస్ లో తనకి ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి ఎదురవ లేదు... అసహనంగా వాచ్ చూసుకుంది......

ఎప్పుడూ లేనిది తను ఈ పిల్ల మూలంగా మాట పడాల్సి వచ్చేలా వుంది....... ఎం.డి గారు రాగానే తను వున్నది వున్నట్లు చెప్పేస్తుంది... ఈ అమ్మాయి మూలంగా ఇన్నాళ్ళుగా ఈ ఆఫీస్ లో వున్న క్రమశిక్షణ మాయం కాక ముందే ... పరిస్థితి పూర్తిగా చేజారిపోకముందే ... బాధ్యత గల వ్యక్తి గా చక్కదిద్దాలి . తప్పదు.

" గుడ్ మానింగ్ మేడం.... " ఎం.డి గారు.. ఆలోచనలో పడి ఆయన రావడమే చూడలేదు... కంగారుగా లేచి " వెరీ గుడ్ మానింగ్ సార్... " తిరిగి విష్ చేసింది.

" ఏమిటీ వర్రీడ్ గా కనబడుతున్నారు., ఎనీ ప్రాబ్లం?. ఈ నెల బిజినెస్ టార్గెట్స్ డిస్కస్ చెయ్యాలి.... రండి.... " చెప్పేసి ఆయన మేనేజర్ రూం లోకి వెళ్ళి పోయారు... టార్గెట్స్ ఫైల్ తీసుకు వెళ్ళింది....

"ప్లీజ్ బి సీటెడ్... ఎనీ థింగ్ రాంగ్ ... " అడిగారు ఏం.డి...

" సర్ ... ఒక చిన్న విషయం... మిస్ ప్రణవి ... న్యూ రిక్రూటీ ... కొంచెం డిస్ప్లిన్ ... పంక్చువాలిటీ ఏస్పెక్ట్స్ ...ఎంత వార్న్ చేసినా సరి చేసు కోవడం లేదు.... పని చాలా ఫాస్ట్ గానూ... పెర్ఫెక్ట్ గానూ చేస్తుంది... కానీ టైంకి

రాదు...     అలాగే ఆఫీస్ టైంలోఫోన్స్ చాలా ఎక్కువ...     మంచి వర్కర్ కదాని ఇన్నాళ్ళూ     పద్ధతి మార్చుకోమని చెబుతూ వచ్చాను ప్చ్... బట్....     ఆఫ్ నో చేంజ్ .. మీ నోటీస్ కి తీసుకు వచ్చా,     ఇట్ ఈజ్ అప్టూ     యూ సర్ టు టేక్ ఏక్షన్....     " బాధ కలిగినా చెప్పక తప్ప లేదు.

" ఐ ..సీ ...     " బెల్ కొట్టి చందర్రావ్ ని అడిగారు...     "ఆ అమ్మాయి వచ్చిందా ?     "

" సార్ ...     వచ్చారు ... "

" ఒక సారి లోపలికి రమ్మను.... "

"గుడ్ మానింగ్ సర్స్ ...అండ్ మేం .     " మర్యాదగా విష్ చేసింది అందరికీ.

"గుడ్ మానింగ్ ... ప్రణవి ప్లీజ్ బి సీటెడ్ ... ఇప్పుడు టైం ఎంతయింది...     మీరు రోజూ లేట్ గా వస్తున్నారని మేడం చెబుతున్నారు...     మీ సమాధానం ఏమిటి... పనితో బాటు మంచి క్రమశిక్షణ కూడా చాలా అవసరం...     " సీరియస్ గా అడిగాడు ... మేనేజర్.

" సారీ సర్... ఈ ఏరియా లో మన ప్రోడక్ట్స్     ఎవరెవరు వాడుతున్నారో ... ఇంకా ఎంత మంది వాడటం లేదో అవన్నీ మార్కెట్ సర్వే చేసి తయారు చేసిన రిపోర్ట్,     కొత్తగా తీసుకున్న ఆర్డర్స్ ....     అవే నేను చేస్తున్న ఫోన్ కాల్స్ ... ఈ రోజు ఎలాగైనా కొంచెం ముందు వచ్చి మేడం కి ఈ విషయం చెబుదామనుకున్నా ,కానీ ఒక కొత్త కస్టమర్ దగ్గర ఆలశ్యం అయింది... సారీ మేం....     " హుందాగా అంది.

"ఎక్సెలెంట్ ...     " అప్పటికే ఆ రిపోర్ట్ చూసి ఒక్క నెలలో సుమారు ఒన్ క్రోర్ బిజినెస్ పెంచిన 'ప్రణవి ని గర్వంగా చూసింది జాగృతి తన అంచనా తప్పు కాదని ...     ఆ అమ్మాయి చాలా టేలెంటెడ్ అనీ...

"ఏం...     మేడం...     ఈ అమ్మాయిని మన కంపెనీ లో వుంచుదామా ...     పోస్టింగ్     లెటర్     ఇచ్చి పంపేద్దామా .... " సీరియస్ గా అడిగాడు .... ఏం.డి..

" లేదు సార్ ..ఇలాంటి టేలెంటెడ్ ఎంప్లొయీ ని ఏ కంపెనీ వదులుకోదు... మనం వదులుకోవద్దు... కాక పోతే .. ఈ అమ్మాయిని మన ఆఫీస్ లో కంటే ... మన మార్కెట్టింగ్ సెక్షన్ ఇంచార్జ్ గా హెడ్ ఆఫీస్ లో వేసుకుంటే మన కంపెనీ కి ఎంతో మంచిదని నా పెర్సనల్ ఒపీనియన్ ... ప్రణవీ ... ఐ యాం ప్రౌడ్ ఆఫ్ యూ మై డియర్.... నీకు చాలా మంచి ఫ్యూచర్ వుంది... ' ఎక్సైటింగ్ గా అంది...

" ఓ ... వెరీ గ్లేడ్... మరి మీరేమంటారు మేనేజర్ గారు... "

"ఏమంటాను... మేడం ...సర్టిఫై చేస్తే ఇంక తిరుగే లేదు.... " సంతోషం గా అన్నాడాయన.

" వెల్ డన్... మై డియర్ . కంగ్రాజులేషన్స్... మన మార్కెట్టింగ్ సెక్షన్ కాదు కాని మన ఎం.డి గా చేసేద్దామనుకుంటున్నా... ఏమంటారు " నవ్వుతూ అడిగాడాయన.

" సార్ " ఇద్దరూ ఒకసారే అన్నారు ఆశ్చర్యం గా .

" చూడండి... ప్రణవి నా ఒక్కగానొక్క కూతురు... ఐ.ఏ.ఎం , అహమ్మదాబాద్ లో ఎం.బి.ఏ చేసింది... తను ఏ మాత్రం చెయ్యగలనో పరిక్షించుకుందుకే కాదు... మన ఆఫీస్ లో ఏమేమి నేర్చుకోవాలో తెలుసుకుందుకి కూడా ఇక్కడ చేరింది... చేరిన మొదటి రోజే చెప్పింది... మీలా క్రమశిక్షణ తో డెడికేటెడ్ గా పని చెయ్యడం నేర్చుకోవాలని.... " ఆనందంగా అన్నాడాయన.

" ప్రణవీ.... సారీ మేడం ... చాలా సంతోషంగా వుంది.... మీ లాంటి కూతురువున్న సార్ చాలా లక్కీ " ఆనందంగా అంది జాగృతి.

" బట్.... ఐ యాం నాట్ హేపీ ...మేం... మీరు రోజూ ఎంత టైర్డ్ గా ... ఎంత టెన్షన్ గా వుంటున్నారో ఈ నెల రోజుల్లో నేను చూసాను... సో... సర్... నా కొత్త పోస్ట్ లో తొలి నిర్ణయం తీసుకోవచ్చా " సీరియస్ గా తండ్రిని అడిగింది...

"ఎస్ ... వై నాట్ ... యూ కేన్.... " ఏం నిర్ణయం తీసుకుంటుందా అని ఆశ్చర్యం గా చూస్తూ అన్నారాయన.

"మేడం... నెక్ట్స్ మంథ్ నుంచి మీరు రానక్కరలేదు.... యూ కేన్ టేక్ రెస్ట్ .... "సీరియస్ గా అంది.

" ప్ర....ణ .... సారీ మేడం... నేనేం చేసాను... అందరి లాగే మీరు టైం కి రావాలని మీరు మా కాబోయే ఏం డి అని తెలియక చెప్పాను... అంతమాత్రానికే మీరు నన్ను ఉద్యోగం లోంచి తీసెయ్యడం..... "

"నో నో ..మేడం మిమ్మల్ని తీసేస్తున్నామని ఎవరు చెప్పారూ... మీరు యిరవై ఏళ్ళుగా మా కంపెనీ అభివృద్ధికి ఎంతో చేసారు... అలాంటి మీకు నేనిచ్చే చిరు కానుక, 'థ్రీ మంథ్స్ లీవ్ విథ్ ఫుల్ సేలరీ'.... అంతే కాదు థ్రీ మంథ్స్ తరువాత మీరు ఈ బ్రాంచ్ కి ఇంచార్జ్ ... మేనేజర్ సార్ వాళ్ళ పిల్లల దగ్గరికి అమెరికా వెళ్ళిపోతున్నారు కదా.... సో ఈ మూడు నెలలూ మీరు బాగా రెస్ట్ తీసుకు రెట్టించిన వుత్సాహం తో రెట్టింపు ఎనర్జీ తో రావాలి.... ఏమంటారు.? అప్పటి వరకూ మీ ప్లేస్ నే భర్తీ చేస్తా... ఓ.కే ...."

" థేంక్స్ ... థేంక్యూ వెరీమచ్ మేడం... నిజం గానే ఈ మధ్య చెయ్య లేక ఇంక మానేస్తేనో అన్న ఆలోచన అస్తమానం కలుగుతోంది... నాకు మీరిచ్చే ఈ కానుక నిజంగా చాలా.. చాలా విలువైనది....... సర్...ఇంక బిజినెస్ డిస్కషన్స్ మొదలు పెడదామా.... "

"దట్ ఈజ్ మేడం...... " నవ్వుకున్నారందరూ.

అలసిన మనసుకీ, మనిషికీ నిజంగా ఎంత అపురూపం ఇలాంటి కానుక.




అచ్యుతపురంలో అప్పడు అనే వాడుండేవాడు. వాడి అమ్మానాన్న చిన్నప్పుడే చనిపోవడంతో నానమ్మే వాడిని పెంచి పెద్దచేసింది. చిన్నప్పటి నుంచి గారాబంగా పెరగడం వల్ల చదువబ్బలేదు. 'వాడు ప్రయోజకుడు కాలేదు, రేపు తను పోతే వాడి బతుకేమవుతుందో' అని తెగ బాధ పడిపోతుండేది ఆ నానమ్మ.

పొద్దుట లేచి కడుపుకింత తిని ఊరంతా బలాదూర్ గా తిరిగేవాడు. అలా తిరుగుతుంటే వాడో వెర్రి బాగులవాడని ఎవరూ పట్టించుకునే వాళ్లు కాదు.

ఒకసారి ఊరికి దూరంగా ఉన్న పాడుబడిన శివాలయం వెనక వాడు కూర్చుని రాళ్లతో ఆడుకుంటుంటే, నలుగురు దొంగలు తాము దొంగిలించిన సొత్తుని పంచుకోవాలని అక్కడికి వచ్చి, అప్పడ్ని చూసి, వాడో తెలివి తక్కువ వాడవడం వల్ల తమకి అపకారం లేదని, ధనం పంచుకుని, నగలు ఎక్కడ అమ్మి సొమ్ముచేసుకుని పంచుకోవాలో చర్చించుకుని వెళ్లిపోయారు.

ఆ తర్వాత అప్పడు ఊళ్లోకి వెళ్లబోతుంటే, రక్షక భటులు కనిపించారు. వాడికి ఎక్కడన్నా తప్పు జరిగితే రక్షక భటులకి చెప్పాలని నానమ్మ ఒకసారి చెప్పి ఉండడంతో వాడు రక్షక భటుల్ని కలిసి తాను చూసిందీ, విన్నది చెప్పేశాడు. మొదట వాళ్లు నమ్మలేదు. అప్పడు పదే పదే అదే విషయం చెప్పడంతో వాళ్లు ఆ నగల దుకాణాల దగ్గరకి వెంటనే వెళ్లి ఆ దొంగల్ని పట్టుకున్నారు.

తర్వాత విషయం తెలుసుకున్న రక్షణాధికారి, అప్పడి నానమ్మ దగ్గరకి వెళ్లి విషయం చెప్పి వాడి వల్ల ఎంతో కాలంగా తప్పించుకుని తిరుగుతున్న గజ దొంగలు పట్టు పడ్డారని, అప్పడు అలాగే వెర్రిబాగుల వాడిలా ఊళ్లో తిరుగుతూ తమకి నేరగాళ్ల గురించి రహస్యంగా తెలియజేస్తే మంచి జీతం ఇస్తామని చెప్పాడు.

వాడి జీవితం గాడిన పడినందుకు ఎంతో ఆనందించింది నానమ్మ.




"అబ్బ.. ఎంతబాగుందీ దప్పళం.. ఎన్నాళ్ళయిందీ ఇలా జుర్రుకుంటూ దప్పళం తినీ.." అంటూ వేళ్ళు నాక్కుంటూ ఆ ఫంక్షన్‌లో పులుసూ అన్నం తింటున్న అన్నయ్యని కొత్తగా కళ్ళప్పగించి చూసాను. అన్నయ్య ఇంకా ఆ మైకం నుంచి తేరుకున్నట్టు లేదు.. "మా అమ్మ సరిగ్గా ఇలాగే చేస్తుంది. దప్పళం కలిపామంటే ఆ రుచికి మరి నాలుగు వాయిలు కలపకుండా వుండలేం.." అంటూ కళ్ళు అరమోడ్చి తాదాత్మ్యం చెందడం మొదలెట్టాడు.

నాకు గుండాగినంత పనైంది. భయపడుతూ వదిన వైపు చూసాను. అన్నయ్య పలికే ప్రతి అక్షరం వదిన చాలా శ్రద్ధగా వింటోంది. ఆరోజు మా బంధువుల ఇంట్లో బారసాల అంటే మా పెద్దమ్మ కొడుకు, కోడలు అయిన అన్నయ్య, వదినలతో కలిసి వెళ్ళాను. ఆ బంధువుల ఇంట్లో పెద్దవాళ్ళు పట్టుపట్టి ఈ కాలంలోలాగా ఫ్రైడ్‌రైసులు, రోటీలు కాకుండా రాజమండ్రీ నుంచి వంటవాళ్లని

హైద్రాబాదు రప్పించి, ఆవపెట్టిన పనసపొట్టుకూరతో సహా అన్నీ సాంప్రదాయకమైన వంటలు దగ్గరుండి మరీ చేయించారు. ఈ సంగతి వాళ్ళు బారసాల మహోత్సవానికి పిలిచిన వాళ్లందరికీ ముందుగానే చెప్పడంతో భోజన ప్రియుడైన మా అన్నయ్య ఆరోజు ఆఫీసుకి శెలవు కూడా పెట్టి మరీ ఫంక్షన్‌కి వచ్చాడు. అక్కడికీ బయల్దేరేముందు అన్నయ్యకి కాస్త హింట్ ఇచ్చాను కూడా.. "అన్నయ్యా, అక్కడ భోజనం బాగుంటే బాగుందను కానీ అంతకుమించి ఎక్కువ పొగడొద్దూ" అని. ఎంతైనా నాకన్న పెద్దవాడాయె.. అంతకన్న చెప్పలేకపోయాను.

అబ్బే.. అన్నయ్య వింటేనా..ఏదో ఓ పూట భోజనానికి వెళ్ళినంతలో ఆ వంటని అంత పొగిడెయ్యాలా..అందులోనూ మా అన్నయ్య లాంటి వాళ్ళు ఉత్తి పొగడడంతో ఆపెయ్యకుండా ఇంట్లో అసలు భార్య కేమీ చేతకాదన్నట్టూ, ఎప్పుడో వాళ్ళ అమ్మ చేసిన వంటే అమృత ప్రాయమన్నట్టు మాట్లాడేస్తారు. పెళ్ళై పదిహేనేళ్ళైనా మా వదిన మా పెద్దమ్మలా వండలేదని అస్తమానం అంటూనే వుంటాడన్నయ్య. అక్కడికీ ఎన్నోసార్లు చెప్పాను నేను మా అన్నయ్యకి..

"అన్నయ్యా, పెద్దమ్మ చేతి వంట వేరు, వదిన చేతి వంట వేరు. పెద్దమ్మ చేసినట్టు కొన్ని వదిన ఎలా చెయ్యలేదో అలాగే వదిన చేసేవి కొన్ని పెద్దమ్మ చెయ్యలేదు కూడా. మరీ వదిన్ని అంత తీసిపడెయ్యకు.. రోజూ నీకు వండి పెట్టాల్సింది వదినే. ఆమెని ఏమైనా అన్నావంటే నీకు కంచంలోకి ముద్ద రాదు.." అని ఎంత స్పష్టంగానో చెప్పాను. అబ్బే బుర్ర కెక్కితేనా! అయినా అసలీ మగవాళ్లందరూ ఆమాత్రం ఎందుకు గ్రహించరో. ఎంత వన్‌వే ట్రాఫిక్ అయితే మటుకు నేను ఒకవైపు నుంచి సైగ చేస్తున్నా కూడా గమనించకుండా అలా పరవశించిపోయి వాగెయ్యడమే..

"అబ్బ.. ఎప్పుడో మా అమ్మ దగ్గరికి వెళ్ళినప్పుడు తప్ప పెళ్ళయాక ఇలాంటి దప్పళం తినలేదు. ఏవిటో.. మా ఆవిడ పొద్దున్న లేస్తే అలా వంటల ప్రోగ్రాములు చూస్తూనే వుంటుంది. ఏవో కొత్త కొత్తవి చేస్తూనే వుంటుంది. ఒఖ్ఖటి నోట్లో పెట్టుకునేలా వుండదనుకోండి. బాబూ, ఏదీ ఇంకో గరిట వడ్డించు.. బెల్లం బహు తూకంగా పడింది చూసేవా చెల్లాయ్.." నన్ను కూడా కలిపేసేడు.. బాబోయ్.. వదిన.. భయం భయంగా వదినవైపు చూసాను. వదిన మటుకు ఏమాత్రం చలించకుండా అపర శాంతమూర్తిలా అన్నం తింటోంది. నాకు అర్ధమైపోయింది.. ఇంటికెళ్ళేక అన్నయ్యకి నాల్రోజులు పస్తే అని నిర్ధారించేసుకున్నాను.

"అయినా ఈ కాలంలో వాళ్ళకి ఈ దప్పళాలూ గట్రా పెట్టడం ఎలా తెలుస్తాయండీ.. ఎంతసేపూ సాంబారులూ, మైసూరురసాలూ అంటారు కానీ అవి ఈ దప్పళం దరిదాపులకైనా వస్తాయంటారా?" పక్కనున్న మరో పెద్దాయనతో అంటున్నాడన్నయ్య. నిజంగానే మా పెద్దమ్మ దప్పళం చాలా బాగా చేస్తుంది. ఆవిడ చేసినప్పుడు మెచ్చుకుంటూ తినడం వేరు. అంతమాత్రాన పక్కన మూడుపూటలా వేడివేడిగా వండిపెడుతున్న వదినని అలా తీసిపడెయ్యాలా?

వెనక్కి వస్తుంటే కూడా దారంతా అన్నయ్య దప్పళం రుచిని అలా తల్చుకుంటూనే వున్నాడు. పెద్దమ్మ దప్పళాన్ని పదిసార్లు

గుర్తు చేసుకోవడంతోపాటు, వదిన వంటకి మరిన్ని వంకలు పెట్టి వేళాకోళాలు చేస్తూనే వున్నాడు. ఇంకిలా నోరు చచ్చిపోయి తను వుండలేననీ, వదినని ఓ నాల్రోజులు తన తల్లి దగ్గరికి పంపించి ఆ వంటలెలా చెయ్యాలో నేర్పిస్తే కాని లాభం లేదని తేల్చేసాడు. "చెల్లాయ్, రేపే పంపిస్తానే వదిన్ని అమ్మ దగ్గరికి. నీకు కూడా ఏమైనా ఇష్టమైన వంటలుంటే చెప్పెయ్యి. నేర్చుకొచ్చేస్తుంది." అన్నయ్య అన్నాడు నాతో. భయం భయం గా వదినని చూసాను. కాని వదిన మటుకు నోరిప్పి ఒక్క ముక్క మాట్లాడలేదు. అది నాకు ఇంకా భయం వేసింది. మా ఇల్లు రాగానే తల వంచుకుని దిగి ఇంట్లోకి వచ్చేసాను.

ఆ రాత్రంతా నాకు కంటి మీద కునుకు పడితే ఒట్టు. పాపం వదిన. తనకి అన్నయ్యంటే ఎంతిష్టం! కష్టపడి అన్నయ్య కిష్టమైనవన్నీ ఎన్ని నేర్చుకుందీ! ఇలా అందరిముందూ అన్నయ్య వదినని తీసిపడెయ్యడం ఏం బాగుందీ! అన్నయ్య మాటలకి వదిన మనసు ఎంత కష్టపెట్టుకుని వుంటుందీ! పైగా రేపు పెద్దమ్మ దగ్గరికి పంపుతాట్ట కూడానూ అవన్నీ నేర్చుకుందుకు. పెద్దమ్మకి ఫోన్ చెసి చెప్పాలి వదిన ఎంత మంచిదో! అయినా అసలీ మగవాళ్లకి పెళ్ళాలనలా తీసిపడేసే హక్కు ఎవడిచ్చాడో? ఇంకెవడు! ఆ దేవుడే అయ్యుంటాడు. ఆయనా మగవాడే కదా!

అలాగ ఒకదాని కొకటి పొసగని ఆలోచనలతో రాత్రంతా గడిపి ఉదయమవగానే ఏమయితే అయిందని వదినకి ఫోన్ చెయ్యడానికి నిర్ణయించేసుకున్నాను. పాపం, అన్నయ్య మాటలకి ఎంత బాధపడుతోందో... ఎంత చిన్న మొహం చెసుకుని పెద్దమ్మ దగ్గరికి వెడుతోందో.. నేనైనా కాస్త ఓదార్పుగా మాట్లాడకపోతే అత్తవారింట్లో వాళ్ళందరూ ఇలాంటి వాళ్ళేనని బాధపడదూ పాపం.. అందుకే ఆగలేక పొద్దున్నే ఇంకా ఏడు కాకుండానే వదినకి ఫోన్ చేసాను. వదిన ఫోన్ ఎత్తగానే " గుడ్ మార్నింగ్ వదినా.." అంటూ ధైర్యం కూడగట్టుకుంటూ విష్ చేసాను.

"ఏంటి స్వర్ణా, ఇంత పొద్దున్నే.. అంతా బాగున్నారు కదా.." అంది మా వదిన. వదిన గొంతు మామూలుగానే వుందే.. అన్నయ్య మీద కోపం ఏమీ ఉన్నట్లు లేదే అనుకుంటూ, "వదినా, నీకు తెల్సుగా.. మా అన్నయ్య సంగతి. వాడి మాటలు పట్టించుకోకు. ఏదో వాగేస్తుంటాడు.." అన్నాను కాస్త ఓదార్పుగా.

"ఏంటి పొద్దున్నే మీ అన్నయ్యకి తాళం వేస్తున్నావు?" అంది వదిన. అంటే ఇంకా కోపం పోలేదన్న మాట.

"అబ్బే ఏం లేదు వదినా.. అన్నయ్య నోసారి పిలు. గట్టిగా అడుగుతాను. అలా నలుగురిముందూ నిన్ను తీసిపడేయ్యొచ్చా అని గట్టిగా అడుగుతాను.." నా సపోర్టు వదినకే అన్నట్టు చెప్పాను.

"మీ అన్నయ్య లేరుగా. మీ పెద్దమ్మ దగ్గరికి వెళ్ళారు నిన్నరాత్రి. చేరినట్టు ఇందాకే కాల్ చేసి చెప్పారు." అంది వదిన. నాకు

గుండె గుభేలుమంది. “ఎందుకు వదినా? పెద్దమ్మ, పెదనాన్న బాగున్నారు కదా? ఏం ప్రాబ్లెమ్ లేదు కదా?” ఖంగారుగా అడిగాను.

“వాళ్ళు బానే వున్నారు. మీ అన్నయ్యే ఈ శనాదివారాల్లో ఆ పనసపొట్టు ఆవపెట్టిన కూర, దప్పళం లాంటివన్నీ నేర్చుకొస్తానని వెళ్ళారు. “

నాకు అర్ధంకాలేదు. “అన్నయ్య వెళ్ళడమేవిటి? నిన్ను పంపుతానన్నాడు కదా వాటికోసం?”

నా ప్రశ్న విని, నా అజ్ఞానానికి చింతిస్తూ అప్పుడు వదిన నాకు గీతాసారాన్ని బోధించింది..

“చూడు స్వర్ణా, మీ అన్నయ్య నన్ను పంపడం, అవన్నీ నేను మీ పెద్దమ్మ దగ్గర అదే మా అత్తగారి దగ్గర శ్రద్ధగా నేర్చుకురావడం జరిగిందనుకో. అప్పుడయినా నేను సరిగ్గా అలాగే చేసినా అది సరిగ్గా మా అత్తగారు చేసినట్లే వస్తుందన్న గారంటీ యేముంది? ఒకవేళ వచ్చినా మీ అన్నయ్యకి నచ్చుతుందన్న నమ్మకమేంటీ? ఆ మనిషికి వాళ్లమ్మ చేసినట్టు ఇంకెవరూ చెయ్యలేరని గొప్ప నమ్మకం. మీ అన్నయ్యకే కాదు..చాలామంది మగవాళ్ళంతే..వాళ్లమ్మ చేసినట్టు ఇంకెవరూ చెయ్యలేరని ఖచ్చితంగా చెప్తారు. ఇన్ని తెలిసున్నప్పుడు నేను పనికట్టుకుని వెళ్ళి ఆ దప్పళాలూ గట్రా నేర్చుకుంటే మటుకు యేంలాభం చెప్పు? అందుకే అదేదో మీ అన్నయ్యే నేర్చుకుని వచ్చేస్తే అదెలా వచ్చినా మనకింక బాధుండదు. మనం నేర్చుకోలేదన్న మాటే వుంటుంది తప్పితే నేర్చుకుని చేస్తే చేసినప్పుడల్లా మా అమ్మ చేసినట్టులేదనే మాటే మనకొస్తుంది. అందుకనే ఈ శనాదివారాలు అక్కడే వుండి, కావల్సినవి నేర్చుకుని రమ్మని నిన్న రాత్రే మీ అన్నయ్యని బస్సెక్కించేసేను.”

తెల్లబోయిన నేను నా చేతిలోంచి జారిపోతున్న ఫోన్ కిందపడకుండా పట్టుకుందుకు చాలా కష్టపడవలసొచ్చింది. గట్టిగా పట్టుకున్న ఫోన్లో “వదినా, నువ్వు నిజంగా గ్రేట్“ అనబోయి, మళ్ళీ పెద్దమ్మ దగ్గర ఏదైనా నేర్చుకురమ్మని నన్నుకూడా బస్సెక్కించేస్తుందేమోనని భయపడి, బలవంతంగా ఆపుకున్నాను. ఎంతైనా వదిన గ్రేట్ అంటూ మనసులో మటుకు అనుకోకుండా వుండలేకపోయాను .